DD9 వార్త
తెలుగు దినపత్రిక
శుక్రవారం, అక్టోబర్ 17 2025

# ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్నా పోటీ అర్హులే

## సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయవచ్చు మంత్రి పొంగులేటి

హైదరాబాద్,అక్టోబర్ 16,(డిడి9 వార్త):

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నా పోటీ చేయొచ్చని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గత ప్రభుత్వంలో ఇద్దరు పిల్లల నిబంధన ఉన్నప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం ఆ పరిమితిని ఎత్తివేసిందని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ "ఇప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్నా పోటీ చేయడానికి అర్హత ఉందని" స్పష్టం చేశారు. ఈ మార్పుతో గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ స్థాయిల్లో సర్పంచ్, మండల సభ్యులు, MPTC, ZPTC ఎన్నికల్లో కూడా ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు పోటీ చేయడానికి అవకాశం లభించింది.





# ఇసుక ర్యాంపుల పై సోషల్ మీడియాలో ఫైర్

- ఇసుక గ్రామసభల పై ప్రజల గుర్రు
- నాశనమైన రోడ్డులు ధ్వంసమైన గ్రామాలే సజీవ సాక్షాలు అంటూ విమర్శలు
- అధికారులకు ఇసుక ఆదాయం పై ఉన్న శ్రద్ధ
- ప్రజల పై ఉండదా అంటూ ఆగ్రహం
- ఇసుక లారీల వలన పోయిన ప్రాణాలు
- పాడై పోయిన ఆరోగ్యం
- మీకు పట్టదా అంటూ ఆవేదన

2 లో

## కొత్తగా అనుమతుల పై ఆగ్రహ జ్వాలలు

వెంకటాపురం, అక్టోబర్ 16, (డిడి9 వార్త):

గత కొంతకాలంగా ఇసుక రవాణా వలన పడుతున్న ఇబ్బందులకు స్వస్తి పలకాలని మండల వాసులు ఎదురుచూస్తున్నారు.ఈ నేపథ్యంలో ఏ ఒక్క అధికారి అయినా వచ్చి ఇసుక రవాణా వలన కలిగే నష్టాలు ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు వస్తార అని ఎదురు చూసారు ఎవరు రాకపోయే సరికి వస్తారన్నా ఆశ పూర్తిగా పోయింది ఇసుక రవాణా సాక్షిగా ధ్వంసమైన గ్రామాలు,నాశనమైన రోడ్లు,దెబ్బతిన్న ఆరోగ్యం,లారికింద నలిగిన ప్రాణాలను గుర్తుచేసుకుంటున్న సమయంలో బుధవారం ఇసుక ర్యాంపుల నిర్వహణ కై అధికారులు కసరత్తు మొదలు పెట్టి గ్రామసభలు నిర్వహించారు దీనితో ఊగిపోయిన ప్రజలు ఒక్కసారిగా సోషల్ మీడియా వేదికగా తమ అక్కసును వెళ్లగక్కారు వారి పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

# ఫలించిన తుమ్మల కృషి..

- ఎర్త్ సైన్సెస్ కు మన్మోహన్ సింగ్ పేరు ఖరారు..
- ముఖ్యమంత్రి "రేవంత్"కు ధన్యవాదాలు తెలిపిన తుమ్మల..
- కొత్తగూడెం కేంద్రంగా విశ్వవిద్యాలయం..
- ఆనందోత్సవాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు

5 లో



# అమీర్‌పేట ముంపునకు హైడ్రా పరిష్కారం

నగర వ్యాప్తంగా ఇదే విధానం

నాలాల డీసిల్టింగ్ పనులు పరిశీలించిన

హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్



10 లో

# వాజేడు అడవుల్లో 'నెమలి' పోలికలతో వింత పక్షి సంచారం,

- రాత్రి వేళల్లో మనుషుల గొంతు శబ్దాలు
- పావురం సైజులో, ఎర్రటి కళ్ళతో దర్శనం.
- పురి విప్పుతూ క్షణాల్లో మాయం, చరవాణుల్లో బంధించిన యువకులు

4 లో





# ఇసుక ర్యాంపుల పై సోషల్ మీడియాలో ఫైర్

## కొత్తగా అనుమతుల పై ఆగ్రహ జ్వాలలు

**వెంకటాపురం, అక్టోబర్ 16, (డిడి9 వార్త):**

వెంకటాపురం మండల కేంద్రంలో బుధవారం కొన్ని గ్రామాలలో ఇసుక ర్యాంపుల నిర్వహణకై అధికారులు గ్రామసభలు నిర్వ హించడం జరిగింది.దీనిపై మండల వాసులు సోషల్ మీడియా వేదికగా తమ ఆగ్రహాన్ని ఒక్కోరు ఒక్కో విధంగా వ్యక్తపరిచారు,తమ ఆగ్రహ జ్వాలలకు అధికారులు ప్రజాప్రతినిధులు ఆహుతాలయ్యేల పోస్ట్ లు పెట్టి ట్రెండింగ్ లో ముందంజలోకొచ్చారు.ఇసుక ర్యాంపులు వద్దు పచ్చని పైర్లు ముద్దు,ప్రజల ఆరోగ్యం ఇసుక ర్యాంపుల వలన ఎలా దెబ్బతింటుందో కనపడుతున్న రోడ్లే నిదర్శనమని చెప్పుకొచ్చారు ఇసుక రవాణా వలన పడుతున్న ఇబ్బందులు నాశనమైన రోడ్డులు ధ్వంసమైన గ్రామాలు ఒక్కప్పుడు ఎలా ఉన్నాయో ఇప్పుడు ఎలా మారాయో చూడమంటూ అధికారులను హెచ్చరించారు వారి స్వలాభం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇసుకాసురులని దరి దాపులోకి రానివ్వకూడదంటూ ముక్త కంఠం తో కోరుతున్నారు ఇసుక రాంపులు నిర్వహణకై సభలు పెట్టే అధికారులు ఇసుకరాంపులు వల్ల వచ్చే సమస్యలపై ఎందుకు సభలు పెట్టట్లేదని. ఇసుక లారీలు తిరగడం వల్ల చెరువులా మారిన రహదారులను నడుంలోతు గుంతలపడిన రోడ్లు ఎందుకు కనపడడం లేదంటూ వాపోయారు ప్రజల సమస్యలను పెడచెవిన పెట్టి అక్రమ ధనార్జన కోసం ప్రాకులాడుతూ ఇసుక ర్యాంపులు వలన కలిగిన నష్టాన్ని పూడ్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం మానేసి ఆ దిశగా ప్రయత్నాలు చేయ్యట్లేదని అసలు పట్టించుకోవడంలేదని ఇసుక ర్యాంపులకు సొసైటీ కు అనుమతి ఇచ్చేముందు ఆ ర్యాంపు పరిధిలో ఇసుక లారీలు నిలుపుదల చేయడానికి తగిన పార్కింగ్ ఏరియా ఉందో లేదో తెలుసుకోవాలని, లారీలు పార్క్ చేయడానికి స్థలం లేని రాంపులకు అనుమతులు ఇవ్వరాదని, పార్కింగ్ లేని రాంపుల వలన ఇసుక లారీలు రోడ్డుపై అడ్డుగా పెడుతున్నారని దీనివలన వాహనాల ప్రయాణానికి తీవ్ర ఆటంకం కలుగుతుందని మాటిమాటికి గంటల తరబడి ట్రాఫిక్ జాములు అవుతున్నాయని, దీనివలన అత్యవసర సమయంలో కేంద్రంలో గల ఆరోగ్య కేంద్రానికి కూడా రోగులు సకాలంలో చేరుకోవడం లేదని, సరైన సమయంలో ఎంతోమంది విద్యార్థులు మండల కేంద్రంలో గల స్కూళ్ళకి కాలేజీకి చేరుకోలేకపోతున్నారు. ఇసుక లారీలు తిరగడం వల్ల చెరువుల్లా మారిన రహదారులపై గత వంద రోజులుగా ఆర్టీసీ బస్సులు పూర్తిగా వెంకటాపురం రావడం ఆగిపో వడంవలన ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతినిందని 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని, ప్రభుత్వానికి ఇసుక తరలింపు మీద ఉన్న శ్రద్ధ ప్రజల పైన రహదారుల పైన లేదని, ఇసుక లారీల ప్రయాణం వల్ల లేచే దుమ్ము వలన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని దుమ్ము వల్ల పంటలు సరైన ఎదుగుదల లేక చనిపోతున్నాయని.. ప్రతి గ్రామ కేంద్రాలలోఅధికారులు రోడ్లను తడిపే విధంగా చర్యలు తీసుకోవాలని. లేనిపక్షంలో రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని ప్రజలు పేర్కొన్నారు, ఈ సమస్యపై సిపిఎం కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్రలు, ధర్నాలు చేసిన అధికారులలో ఎటువంటి చలనం లేదు అని, స్థానిక రాజకీయ పార్టీలు అఖిలపక్షంగాఏర్పడి ఈ సమస్యపై సమాలోచనలు జరిపి.. రహదారులు నిర్మించేలా, దుమ్ము నివారణకు సరైన చర్యలు తీసుకోవాలని అధికారులపై ఒత్తిడి తేవాలని కోరుతున్నారు.. అవసరమైతే ప్రతి గ్రామం నుంచి ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళన నిర్వహిస్తామని, సమస్య పరిష్కారం అయ్యేదాకా ఇసుక లారీలను తిరగబోనివ్వమని హెచ్చరించారు. తక్షణమే ఈ సమస్యపై మంత్రులు ,కలెక్టర్ స్పందించాలని వెంకటాపురం మండల ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

**కేవలం సొసైటీ సంబంధించిన వారిని కాకుండా మండల వాసులందరి అభిప్రాయాల సేకరిస్తే అసల విషయం తెలిసేదని అధికారులు కూడా ఇసుక మాఫియా కి కొమ్ముకాయడంతో ప్రజాప్రతినిధుల కూడా ఇసుకాసురులతో జట్టు కట్టడం వలన ప్రజల అభిప్రాయాలు సేకరిస్తే ఎక్కడ ఇసుక ర్యాంపులు మూసివేయాల్సి వస్తదో అని భయపడి తమకు అనుగుణంగా ఉన్న వారి వద్ద గ్రామసభలు నిర్వహించి వెళ్లారని అభిప్రాయ పడుతున్నారు ప్రజలందరికీ తెలిసి ఉంటే కచ్చితంగా సభను ఆపే వారని ప్రతి ఒక్కరి మనుసులో భావనను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు ఇసుక రవాణా మొదలుపెడితే రోడ్ల పై భైఠాయించి లారీ లను నిలిపివేసేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.**







# ఇసుక రవాణాలో పర్యవేక్షణ లోపం రావొద్దు

- -భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి అక్టోబర్ 16( డి డి 9 వార్త )**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం అవసరమయ్యే ఇసుక రవాణాలో ఏ విధమైన పర్యవేక్షణ లోపల రావద్దని భూపాలపల్లి శాసనసభ్యులు సత్యనారాయణ రావు అన్నారు.గురువారం ఐడిఓసి కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాపై కలెక్టర్ ఎస్పీ లతో కలిసి రెవెన్యూ, పోలీస్, అటవీ, మైనింగ్, గృహ నిర్మాణ, పంచాయతి రాజ్ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంబర్ ప్లేట్లు లేని వాహనాలను తక్షణం సీజ్ చేయాలని, అలాగే అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన రీచ్ ల నుండి మాత్రమే ఇసుక రవాణా చేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల జాభితా, ఇతర ప్రభుత్వ పనులు పూర్తి అయిన వివరాలు ఎంపిడిఓ కు ఇవ్వాలని, పూర్తి అయిన పనులకు ఇసుక రవాణాను అరికట్టాలని తెలిపారు. మన జిల్లా ప్రజలకు మాత్రమే ఇసుక సరఫరా చేయాలని, ఇతర జిల్లాలకు లేదా ప్రాంతాలకు రవాణా పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. సరిహద్దుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు ద్వారా పటిష్ట పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అక్రమ ఇసుక నిల్వలు ఉంచితే అవి సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఉంటుందని తెలిపారు. ఒక రోజుకు ఒక వాహనానికి మాత్రమే జారీ చేసిన కూపన్ ఆధారంగా ఒక ట్రిప్పు రవాణాకు అనుమతి ఉంటుందని, కూపన్ లేని వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. అధిక లోడు వేసే వాహనాలపై సీజ్ చేయడంతో పాటు జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ గృహ నిర్మాణదారులు ఇసుక కొరకు తమ గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా కూపన్ పొందాలని, గుర్తించిన రీచ్‌ల నుండి మాత్రమే రవాణా చేయాలని సూచించారు. ఆదివారాలు మరియు ప్రభుత్వ సెలవు దినాల్లో ఇసుక రవాణాకు అనుమతి ఉండదని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మమాట్లాడుతూ విధుల నిర్వహణ లో నిర్లక్ష్యం వహిస్తే విధుల నుండి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మండలాల్లో తహసిల్దార్, ఎంపీడీవో, ఎంపీవోలు సంయుక్తంగా జిపివోలకు అవగాహన సమావేశం నిర్వహించాలని తెలిపారు. మండలం, మున్సిపల్ స్థాయిలో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ టీము అధికారులు, జిపివోలు, పోలీస్, టిజి ఎండిసి అధికారులు నిరంతర తనిఖీలు చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన సమయపాలన పాటించాలని రీచ్ లలో రెండు షిఫ్ట్ లు పర్యవేక్షణ చేసేలా అధికారులను నియమించాలని తెలిపారు. ఇసుక రవాణాలో జిల్లాకు ఎలాంటి చెడ్డ పేరు తెవొద్దని పారదర్శకంగా, నిస్పక్షపాతంగా, కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

**ఎస్పి కిరణ్ కరేమాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాను**

కంట్రోల్ చేయాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందని తెలిపారు. పటిష్ట పర్యవేక్షణ వల్ల ఫలితాలు ఉంటాయని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే క్రమబద్దీకరణ జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతిరోజు జారీ చేసిన కూపన్ల నివేదిక అందజేయాలని తెలిపారు. తక్షణ సమాచారాన్ని వాట్సప్ గ్రూపులో పెట్టాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ లో ట్రాక్టర్ల జాబితా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మైనింగ్ ఎడి జయరాజు, డిపిఓ శ్రీలత, భూపాలపల్లి నియోజకవర్గ మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌలిక వసతులపై దృష్టి సారించాలి

- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్

**భద్రాచలం, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. గురువారం భద్రాచలంలోని ఐటిడిఏ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న హెచ్ఎంలు, వార్డెన్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ బి రాహుల్ మాట్లాడుతూ పాఠశాలల్లో మరమ్మత్తులు అవసరమైతే వెంటనే పూర్తి చేయాలని, మరమ్మత్తులు చేసే ముందు, చేసిన తర్వాత ఫోటోలు తీసి పంపాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పనికిరాని భవనాల వివరాలు సేకరించి సమర్పించాలని ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులకు సూచించారు. డైలీ వేజ్ వర్కర్లు సమ్మెలో ఉన్నందున ఈ నెల 20 వరకు వేచి చూసి వారిని పునర్నియమించుకునే వీలు కల్పిస్తానని తెలిపారు. వర్షాలు తగ్గుతున్నప్పటికీ వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నందున విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హెచ్చరించారు.



ప్రతి పాఠశాలలో మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని, ఏఎన్ఎంలు వాటిని వినియోగించేలా హెచ్ఎంలు పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాలల్లో మెనూను కచ్చితంగా పాటించి నాణ్యమైన భోజనం అందించాలని, జిసిసి వారు సరఫరా చేసే బియ్యం లేదా ఇతర సామాగ్రి నాసిరకంగా ఉంటే వెంటనే తిరిగి పంపాలని రాహుల్ ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థుల కోసం స్టడీ అవర్స్ తప్పనిసరిగా నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో ఈ శనివారానికి సిబ్బంది సర్దుబాటు పూర్తి చేస్తామని తెలిపారు. 220 జిపి పాఠశాలలు, 50 ఆశ్రమ పాఠశాలల్లో ఉద్దీపకం వర్క్ బుక్ అమలుతో విద్యార్థుల బేసిక్స్ మెరుగుపడినట్లు గమనించామని, నవంబర్ నాటికి చదవడం, రాయడం వంటి నైపుణ్యాల్లో పూర్తిస్థాయి అభివృద్ధి సాధించాలని సూచించారు. డిసెంబర్ 15న ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇంగ్లీష్, తెలుగు, గణితం బేసిక్స్‌పై ఎస్‌జీటీలు శిక్షణ తీసుకుని విద్యార్థుల బలహీనతలను తీర్చాలని రాహుల్ సూచించారు. కెరీర్ గైడెన్స్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని, ప్రతి టీచర్ ఐదుగురు విద్యార్థులను ఎంచుకుని వారికి కెరీర్ గైడెన్స్ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలవడంతో రాష్ట్రంలోని 712 ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పిడి, పీఈటీలు విద్యార్థులకు క్రీడలపై తర్ఫీదు ఇవ్వాలని, ఇప్పటికే ప్రారంభించిన హ్యాండ్‌బాల్, టేబుల్‌టెన్నిస్ వంటి క్రీడల్లో సత్ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. కొత్త క్రీడల ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అశోక్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, డిఎం జిసిసి సమ్మయ్య, ఏసీఎంఓ రమేష్, ఏటిడివోలు చంద్రమోహన్, భారతీదేవి, జిసిడిఓ అలివేలు మంగతాయారు, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, జిసిసి మేనేజర్లు, డీఈలు, ఏఈలు, పిఎంఆర్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేటగాళ్ల బైండోవర్

**కాటారం అక్టోబర్ 16( డి డి 9 వార్త )**

అటవీ జంతువుల కోసం విద్యుత్ తీగల మార్చిన ఉచ్చులు బిగించిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడతాయని ఎస్సై రమేష్ హెచ్చరించారు. పలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలోని లెంకల గడ్డ, పలిమెల, బోడాయిగూడెం, ముకునూరు గ్రామాలకు చెందిన కొంతమంది వ్యక్తులు తమ పంట చేనుల చుట్టు అడవి జంతువుల కోసం విద్యుత్ తీగ లను, ఉచ్చుల ను బిగిస్తున్నారనే సమాచారం మేరకు పలిమెల ఎస్సై ఆయా గ్రామాలకు చెందిన అనుమానాస్పద 15 మందిని పోలీస్ స్టేషన్ కి పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చినారు. అడవి జంతువులకు ఉచ్చులు పెట్టడం నేరమని, వాటి వలన మనుషులు కూడా గాయపడడం లేదా మరణించే ఆస్కారం ఉందని, ఎవరైనా పంట చేనుల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చిన ,ఉచ్చులు పెట్టినా, పెట్టే వాళ్లకు సహకరించినవారికి జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. అడవి జంతువులను మాంసం కోసం వేటాడడం, వాటి మాంసం అమ్మటం, తినటం చట్టరీత్య నేరం కనుక అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు.. కౌన్సెలింగ్ అనంతరం వారందరిని పలిమెల తహసిల్దార్ ముందు హాజరు పరుచగా, తహసిల్దార్ వారందరికీ ఒక్కొక్కరికి యాభై వేల రూపాయల పూచి కత్తు తో విడుదల చేశారు.

# పోలీస్ అమరవీరుల స్తూపం ఆవిష్కరణ

**భూపాలపల్లి అక్టోబర్ 16( డి డి 9 వార్త )**



భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల స్తూపంను ఎస్పీ కిరణ్ ఖరే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులు సమాజానికి స్ఫూర్తిదాయకులు అన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ పోలీసు సిబ్బంది ప్రజల రక్షణలో కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పి శ్రీనరేష్ కుమార్ , భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు, కాటారం డిఎస్పి సూర్యనారాయణ , సిఐలు ఎస్సైలు,డిపిఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టపాసుల అమ్మకానికి...
# అనుమతి తప్పనిసరి

**మంగపేట,అక్టోబర్16(డిడి 9వార్త)**



మండల కేంద్రంలో రానున్న దీపావళి పండుగకు సంబంధించి ఎవరైనా టపాసులు అమ్మదలుచుకుంటే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మండల ఎస్సై టీవీఆర్ సూరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు దీపావళి పండుగ సందర్భంగా టపాకాయలు అమ్మదలుచుకుంటే సంబంధిత అధికారుల నుండి అనుమతి పొంది టపాకాయలను అమ్ముకోవాలని ఆయన సూచించారు. అలా కాకుండా అనుమతులు లేకుండా టపాకాయలను అక్రమంగా అమ్మిన యెడల అట్టివారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

# క్రీడా పోటీలకు గిరిజన విద్యార్థులను సిద్ధం చేయాలి

- ఐటీడీఏ పీఓ బి. రాహుల్ ఆదేశం
- డివిజన్ స్థాయిలో 17, 18 తేదీల్లో ఎంపికలు




**భద్రాచలం అక్టోబర్ 16 డిడి 9 వార్త**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థులను ఈ నెలలో జరిగే డివిజనల్ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేలా చూడాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ సంబంధిత హెచ్ఎంలు, వార్డెన్లు, పీడీలు, పీఈటీలకు ఆదేశించారు. గురువారం నాడు ఒక ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు.

గిరిజన క్రీడల ఎంపిక పోటీలు ఐటీడీఏ భద్రాచలం పరిధిలో నిర్వహించబడుతున్న ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, వసతి గృహాల బాల, బాలికలకు జరుగుతాయని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి గిరిజన క్రీడా పోటీల కోసం జిల్లాను దుమ్ముగూడెం, మణుగూరు, దమ్మపేట, పాల్వంచ, ఇల్లందు అనే 5 డివిజన్లుగా విభజించడం జరిగిందని తెలిపారు. ఈ డివిజనల్ స్థాయి క్రీడా ఎంపికలు ఆయా కేంద్రాల్లో ఈ నెల 17, 18 తేదీలలో నిర్వహించబడతాయని ఆయన వెల్లడించారు. సంబంధిత పీడీలు, పీఈటీలు విద్యార్థినీ విద్యార్థులను బాధ్యతగా క్రీడలు జరిగే సెంటర్లకు తీసుకొని వచ్చి, వారికి ఇష్టమైన క్రీడలలో తప్పనిసరిగా పాల్గొనేలా చేసి, ఈ క్రీడా ఎంపికలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# వాజేడు అడవుల్లో 'నెమలి' పోలికలతో వింత పక్షి సంచారం

- రాత్రి వేళల్లో మనుషుల గొంతు శబ్దాలు
- పావురం సైజులో, ఎర్రటి కళ్ళతో దర్శనం.
- పురి విప్పుతూ క్షణాల్లో మాయం, చరవాణుల్లో బంధించిన యువకులు

**వాజేడు అక్టోబర్ 16 డిడీ9 వార్త**

వాజేడు మండలంలోని గుమ్మడి దొడ్డి, ఇప్పగూడెం అటవీ మరియు వ్యవసాయ ప్రాంతాలలో ఇటీవల ఒక వింత పక్షి సంచరిస్తూ స్థానిక ప్రజలను అమితంగా ఆశ్చర్యపరుస్తోంది. అరుదైన లక్షణాలతో ఉన్న ఈ పక్షిని చూడడానికి స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. పావురం సైజులో ఉన్న ఈ పక్షి, అత్యంత ఆకర్షణీయంగా ఎరుపు రంగు కళ్లను కలిగి ఉంది. ముఖ్యంగా, ఇది నెమలి మాదిరిగా అప్పుడప్పుడు పురి విప్పుతూ, వెంటనే క్షణాల్లో ఎగిరి మాయమవుతుండడం మరింత విశేషం. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం, ఈ వింత పక్షి రాత్రివేళల్లో మనుషుల గొంతు లాంటి శబ్దాలు చేస్తోందని చెబుతున్నారు. గురువారం ఉదయం గుమ్మడి దొడ్డి, ఇప్పగూడెం ప్రాంతాలలో పొలాల్లో దుక్కులు దున్నుతున్న రైతులు ఈ పక్షిని గమనించారు. కొంతమంది యువకులు దానిని తమ చరవాణిల్లో చిత్రీకరించడానికి ప్రయత్నించారు. అయితే, ఫోటోలు తీస్తుండగా ఆ పక్షి అద్భుతంగా నెమలి లాగా పురి విప్పి, వెంటనే ఆకాశంలోకి ఎగిరిపోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ వింత పక్షి ఏ జాతికి చెందినదనే అంశంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. దీనిపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అటవీ శాఖ అధికారులు త్వరలో ఆ ప్రాంతాన్ని పరిశీలించనున్నారు.







# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- డిఎస్పీ రవీందర్ రెడ్డి

**మణుగూరు, అక్టోబర్ 15, డిడి9 వార్త**

మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్ నగర్లో "చైతన్యం" (డ్రగ్స్ పై యుద్ధం) లో భాగంగా మణుగూరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చైతన్యం (డ్రగ్స్ పై యుద్ధం) కార్యక్రమాలలో భాగంగా మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్ నగర్లో సుమారుగా 100 ఇండ్లలో సోదాలు నిర్వహించడం జరిగింది. సరిగా పత్రాలు లేకుండా నెంబర్ ప్లేట్లు లేని 58 ద్విచక్ర వాహనాలను, 05 ఆటోలను సీజ్ చేయడం జరిగింది. బెల్టు షాపులు నడుపుతున్న నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి 30,000/ రూపాయల విలువ గల మద్యాన్ని స్వాదీనం చేసుకున్నారు. డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనంతరం అశోక్ నగర్ వాసులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక మరియు సాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మట్కా, జూదం, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదని తెలిపారు.



 అదే విధంగా చైతన్యం పేరుతో చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా యువత డ్రగ్స్ మహమ్మారిన పడకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్ధాల వలన కలిగే అనర్ధాల గురించి వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నేరాల నియంత్రణ కోసం తమ నివాస ప్రాంతాలలో సీసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 100 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ములుగు జిల్లా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగే " బంద్ " జయప్రదం చేయండి...

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా ఉపాఅధ్యక్షులు మంచర్ల నాగేశ్వరావు

**అక్టోబర్ 16. డిడి 9 వార్త వెంకటాపురం( నూగురు)**

ములుగు జిల్లా జేఏసీ అధ్యర్యంలో జరిగిన సమావేశం లో JAC అధ్యక్షులు ముంజలా బిక్షపతి గౌడ్ పాల్గొని మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలు కోసం ప్రియమైన ST. SC. మైనార్టీ అనుబంధ సంఘాలు మరో తెలంగాణ ఉద్యమం, తరహా ఉద్యమ కార్యచరణకు శ్రీకారం చుట్టబోతున్నామని అన్నారు. కనీసం బీసీలకు జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్, ఎన్నికలలో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించరా అంటూ ప్రభుత్వాలను ప్రశ్నించారు. గత 30 ఏళ్ల నుండి బీసీల జనాభా గణనీయంగా పెరిగిన తగిన రిజర్వేషన్ లేక అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, కనీసం స్థానిక ఎన్నికలలోనైనా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయలేరా ఇదెక్కడి వ్యవస్థ అని అన్నారు. బీసీ ప్రజలు అందరు కలిసి ముక్తకంఠంతో పోరాటం చేయాలని అన్నారు. రాజకీయాలు ముఖ్యం కాదు, రాజ్యాధికారం బీసీలకు కావాలని, అగ్రకులాల అధిపత్యంలో బీసీలు నలిగిపోతున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలందరూ రాజకీయాలకతీతంగా కుల సంఘాలు, ప్రజా సంఘాలు ఐక్యతగా భావించి బందులో పాల్గొనాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ జేఏసీ నిర్వహించే బందును విజయవంతం చేయడానికి ములుగు జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో జరిగిన బీసీ జేఏసీ సమావేశానికి హాజరై 18. వ తారీకు న తెలంగాణ బంద్ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పోనుగోటి రవి, గోల్కొండ రాజు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా యూత్ అధ్యక్షులు తోటకూరి శ్రీకాంత్ గౌడ్. వెంకటాపురం మండల జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి బట్ట నాగేందర్. మల్లంపల్లి మండల అధ్యక్షులు జింక వేణు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజక వర్గ ఇంచార్జ్ బక్కి నవీన్. మహమ్మద్ బాబుల్, కుక్కల సంపత్, నారోజు అఖిల్. మహమ్మద్ ఖలీల్, భాస్కర్ గౌడ్, చింత నిప్పుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.











# ఫలించిన తుమ్మల కృషి..

- ఎర్త్ సైన్సెస్ కు మన్మోహన్ సింగ్ పేరు ఖరారు..
- ముఖ్యమంత్రి "రేవంత్"కు ధన్యవాదాలు తెలిపిన తుమ్మల..
- కొత్తగూడెం కేంద్రంగా విశ్వవిద్యాలయం..
- ఆనందోత్సవాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, అక్టోబర్ 15, డిడి9 వార్త**

తెలంగాణ ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని భారత మాజీ ప్రధానమంత్రి, ఆర్థిక సంస్కరణల శిల్పి డా. మన్మోహన్ సింగ్ పేరుతో ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో "మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ" తెలంగాణ విద్యా చరిత్రలో ఒక మైలురాయి. రాష్ట్ర ప్రభుత్వం చూపిన దూరదృష్టి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుంది. ఈ నిర్ణయం వెలువడగానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు శుభాకాంక్షలు తెలిపారు.

**మైనింగ్ కళాశాల నుండి విశ్వవిద్యాలయం...**

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ దేశంలోనే ఎక్కడాలేని విధంగా 300 ఎకరాలలో విశ్వవిద్యాలయం రూపుదిద్దుకుంది. అయితే ఇప్పటికే కొత్తగూడెం మైనింగ్ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ "ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ"గా కాంగ్రెస్ ప్రభుత్వం మార్పు చేసింది. ఇప్పుడు విశ్వవిద్యాలయానికి మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం విద్యా వ్యవస్థలో తన దృష్టికోణాన్ని మరింత స్పష్టంగా ప్రభుత్వం తెలియజేసినట్టయింది.

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేష కృషి...**

ఎర్త్ సైన్సెస్ కళాశాలను డా. మన్మోహన్ సింగ్ పేరు మీద ఏర్పాటు చేయడంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చడంలోనూ, మన్మోహన్ సింగ్ పేరు ఖరారు చేయడంలోనూ ఆయన విశేష కృషి చేశారు. తమ జిల్లాకు విశ్వవిద్యాలయం దక్కడం ద్వారా తాను కలగన్న స్వప్నం సాకారమైందని తుమ్మల పేర్కొన్నారు. "రేవంత్ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం తెలంగాణ విద్యా రంగానికి కొత్త దిశను చూపుతుంది" అని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులకు మంచి విద్యావకాశాలు లభించే అవకాశాలు ఏర్పాడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**300 ఎకరాల్లో అద్భుత ప్రాజెక్ట్ – దేశానికే తలమానికం...**

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ ఉన్న స్థావరంలోనే 300 ఎకరాల విస్తీర్ణంలో "మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ" రూపుదిద్దుకుంటోంది. అత్యాధునిక ల్యాబ్‌లు, అంతర్జాతీయ ప్రమాణాల పరిశోధనా సౌకర్యాలతో ఈ విశ్వవిద్యాలయం దేశంలోనే ఒక ప్రత్యేక మోడల్‌గా నిలవనుంది. ఇక్కడి నుండి వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యా, శాస్త్ర పరిశోధనల్లో ముందంజ వేయనున్నారు. భూవిజ్ఞానం, ఖనిజ వనరుల వినియోగం, పర్యావరణ సంరక్షణ వంటి రంగాల్లో పరిశోధనలు కొనసాగనున్నాయి.

**భవిష్యత్తు తరాల కోసం శాస్త్రీయ కేంద్రం...**

ఈ విశ్వవిద్యాలయంలో జియోకెమిస్ట్రీ, జియోఫిజిక్స్, ప్లానెటరీ జియాలజీ, స్ట్రక్చరల్ జియాలజీ, పర్యావరణ భూగర్భశాస్త్రం వంటి కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. భూగర్భ వనరుల పరిశోధనకు, దేశ సుస్థిర అభివృద్ధికి ఇది ప్రధాన కేంద్రమవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం.. ఖనిజ సంపదకు నూతన గుర్తింపు...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహజ వనరులు, బొగ్గు మరియు ఖనిజాలతో సమృద్ధిగా ఉంది. ఇది దక్షిణ భారతదేశానికి "ఖనిజ నిధి"గా పరిగణించబడుతోంది. ఈ ప్రాంతంలో నేషనల్ హైవేకు సమీపంగా 300 ఎకరాల విస్తీర్ణంలో ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటవుతోంది. సమీపంలో ఐటీసీ పేపర్ బోర్డు, హెవీ వాటర్ ప్లాంట్, నావా లిమిటెడ్, ఫెరో ఎల్లాయ్ పరిశ్రమలు, విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. అదేవిధంగా, 20 కిలోమీటర్ల దూరంలో ప్రతిపాదిత విమానాశ్రయం కూడా రానుంది. గోదావరి నది సమీపంలో ఉండడం వలన నీటి సమస్యలు ఉండవు.

**ఉపాధి అవకాశాల పునరుజ్జీవనం....**

విశ్వవిద్యాలయం ఏర్పాటుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిరుద్యోగ యువతకు కొత్త అవకాశాలు లభించనున్నాయి. వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తి చేసి పరిశోధన, పరిశ్రమల రంగాల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. అంతేకాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా అక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుంది.

**జాతీయస్థాయి గుర్తింపు – గర్వకారణం తెలంగాణకు....**

మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుతో తెలంగాణ విద్యా రంగం జాతీయస్థాయిలో కొత్త గుర్తింపు పొందనుంది. మాజీ ప్రధాని గౌరవార్థం ఈ పేరు పెట్టడం రాష్ట్రానికి గౌరవకారణం. భద్రాద్రి కొత్తగూడెం పేరు ఇకపై జాతీయ స్థాయిలో మారు మ్రోగనుంది.

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సంబరాలు....**

తెలంగాణ క్యాబినెట్ నిర్ణయంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆనందోత్సాహం వెల్లివిరిసింది. ప్రజలు, విద్యార్థులు, శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు విశ్వవిద్యాలయానికి మన్మోహన్ సింగ్ పేరు రావడం పట్ల గర్వంగా భావిస్తున్నారు. విద్యార్థి సంఘాలు, ప్రజాసంస్థలు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ సంతోష వెలిబుచ్చుతున్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- -భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగరాదు
  -భూపాలపల్లి ఎమ్మెల్యే గంగ సత్యనారాయణరావు

**భూపాలపల్లి అక్టోబర్ 16 (డీ డీ 9 వార్త )**

రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి బుగులోని జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన బుగులోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం జాతర, బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పోలీస్, సింగరేణి, వైద్య, ఆర్టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. శాసన సభ్యులు మాట్లాడుతూ, రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో నవంబర్ 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరిగే శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి జాతరకు వేలాదిమంది భక్తులు తరలివస్తారని, అందువల్ల అన్ని శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా తాత్కాలిక మరమ్మతులు, రహదారి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. భక్తులు గుట్టపైకి ఎక్కడానికి అనువుగా ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పరకాల, భూపాలపల్లి ఇతర డిపోల నుండి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అత్యవసర వైద్య కేంద్రాలు, 108 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. భక్తులకు సురక్షిత త్రాగునీరు అందించేందుకు ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతర సమయంలో భక్తుల రద్దీ నియంత్రణకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచాలని, అలాగే అటవీ శాఖ తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జాతర నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారిగా చేపట్టాల్సిన పనులపై అంచనా నివేదికలు ఇవ్వాలని సూచించారు. సిసి కెమెరాల ద్వారా బందోబస్తు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే, అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సింగరేణి జీఎం రాజేశ్వర రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఆర్టీసీ డిఎం ఇందు, డివిజనల్ పంచాయతి అధికారి మల్లికార్జున్ రెడ్డి, దేవస్థానం చైర్మన్ రమణా రెడ్డి, దేవస్థానం ఈఓ బిల్ల శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సి.ఎస్.పి లో కార్మికుల వేదింపులు తీవ్ర స్థాయికి!!



- **అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి డిమాండ్**
- **ఇన్‌ఫార్మర్ గిరి చేస్తే కార్మికులే తరిమికొట్టే పరిస్థితి – ఏఐటియుసి నాయకుల హెచ్చరిక**

**పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

సి.ఎస్.పి 1 లో విధుల్లో ఉన్న కార్మికులను మానసికంగా వేధిస్తున్న అధికారులపై యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె వన్ సి.ఎస్.పి వద్ద జరిగిన గేట్ మీటింగ్‌లో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచ్ కార్యదర్శి ఆరెల్లి పోషం పాల్గొని మాట్లాడుతూ, అధికారులు కొంతమంది కార్మికులు, సూపర్‌వైజర్లను “ఇన్‌ఫార్మర్‌లు, గూఢచారులు”గా వాడుకుంటూ విధుల్లో ఉన్న కార్మికులపై ఫోటోలు, వీడియోలు తీసి వారిని వేదించడం దారుణమన్నారు.

ఇది ప్రభుత్వ రంగ సంస్థ అని గుర్తు చేస్తూ, ప్రైవేటు సంస్థల మాదిరిగా వ్యవహరించడం ఏ విధంగానూ సహించేది కాదని హెచ్చరించారు. “వన్ సి.ఎస్.పి అధికారులు నియంతలుగా ప్రవర్తిస్తూ, తాము అనుకూలంగా ఉన్న కార్మికులకు ఎలాంటి విధులు అప్పగించకుండా మస్టర్లు ఇస్తూ వారిని ఇతరులపై గూఢచారులుగా వాడుకోవడం తగదని” అన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న అధికారులపై యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని, లేనిచో కార్మికులే వారిని తరిమికొట్టే పరిస్థితి వస్తుందని నాయకులు హెచ్చరించారు. సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడేది ఏఐటియుసి మాత్రమేనని, సంస్థ రక్షణ కోసం తాము ఎప్పటికప్పుడు అండగా ఉంటామని వారు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచ్ డిపార్ట్‌మెంట్ ఇంచార్జి సయ్యద్ సోహేల్, నాయకులు ఎస్. వెంకట్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్ కార్యదర్శి బండి మల్లేష్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ. గౌస్, నాయకులు బి. సమ్మయ్య, జానీమియా, రాజేశ్వరరావు, సుభాష్, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.



# మాత శిశు సంరక్షణ వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం...

**అక్టోబర్ 16 డిడి 9 వార్త వెంకటాపురం (నూగురు).**

వెంకటాపురం మండల కేంద్రంలో గల నూగురు, మహితాపురం ,గంగారం గ్రామాలలో మాత శిశు సంరక్షణ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగింది. గ్రామంలో గల గర్భిణీ స్త్రీలు, బాలింతలకు మధుమేహం, రక్తపోటు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేయడం జరిగింది. జ్వర పీడితులకు రక్తన మూలాలు సేకరించి ఆర్టీడీ నిర్ధారణ పరీక్షలు చేయడం జరిగింది. బాలింత తల్లులకు వ్యాధినిరోధక టీకాలు తప్పక వేయించాలని వైద్యాధికారి తెలిపారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వేడి వేడి ఆహారం,కాచి చల్లార్చిన నీరుని మాత్రమే తాగాలని గ్రామస్తులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాతా శిశు సంరక్షణ అధికారి భాస్కరరావు తో పాటు H.E.O కోటిరెడ్డి, స్టాఫ్ నర్స్ స్వప్న, హెల్త్ అసిస్టెంట్ రాఘవులు, అంగన్వాడి టీచర్ ,ఆశా కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కమీషనరేట్ లో ఫ్లాగ్ డే వారోత్సవాలు



- **అక్టోబర్ 21 నుండి 31 వరకు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు**
- **షార్ట్ ఫిలిం, ఫోటోగ్రఫీ పోటీలు**
- **సీపీ అంబర్ కిషోర్ ఝా**

**పెద్దపల్లి/రామగుండం, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

రామగుండం కమిషనరేట్ పరిధిలో అక్టోబర్ 21 నుండి 31 వరకు పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ స్టేషన్ పరిధుల్లో పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు**

ప్రజల్లో పోలీస్ సేవలపై అవగాహన కల్పించేందుకు ఓపెన్‌హౌస్‌ కార్యక్రమాలు చేపట్టనున్నారు. పోలీస్ విధులు, సాంకేతిక వినియోగం, త్యాగాలు, సేవలను వివరించనున్నారు. పోలీసు సిబ్బందికి రెండు వర్గాలుగా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు.

కేటగిరీ-1: కానిస్టేబుల్ నుంచి ఎఎస్ఐ వరకు —— జెండర్ డిస్క్రిమినేషన్ ఎట్ వర్క్ ప్లేస్

కేటగిరీ-2: ఎస్ఐ స్థాయి నుండి పై స్థాయి వరకు —— స్ట్రెంథెనింగ్ ఆఫ్ గ్రౌండ్ లెవెల్ పోలీసింగ్ వ్యాసాలు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో 500 పదాలకు మించకూడదని తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

**రక్తదానం, సైకిల్ ర్యాలీలు**

పోలీస్ అమరవీరుల స్మారకార్థం రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలను నిర్వహిస్తారు. అమరవీరుల కుటుంబాలను సందర్శించి నివాళులు అర్పించనున్నట్లు సీపీ తెలిపారు.

**షార్ట్ ఫిలిం, ఫోటో పోటీలు**

పోలీసు త్యాగాలు, సేవలపై ఆసక్తిగల యువత పాల్గొనాలని సీపీ పిలుపునిచ్చారు.

షార్ట్ ఫిలిం: గరిష్టంగా 3 నిమిషాల నిడివి.

ఫోటోలు: 10 x 8 సైజులో మూడు ఫోటోలు.

ఫోటోలు, వీడియోలను అక్టోబర్ 23లోపు స్పెషల్ బ్రాంచ్ (ఎస్ఐబి) కార్యాలయానికి అందజేయాలని సూచించారు. ఎంపికైన ఫిలింలు, ఫోటోలు రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ అక్టోబర్ 21 నుంచి 31 వరకు పోలీస్ కళాబృందం పాటల కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రధాన కూడళ్ల వద్ద అమరవీరుల బ్యానర్లను ఏర్పాటు చేస్తారు. అక్టోబర్ 21న రామగుండం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో “స్మృతి పరేడ్”, “పోలీస్ ఫ్లాగ్ డే” కార్యక్రమాలు నిర్వహించి అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తామని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు లాభాల వాటా, దీపావళి బోనస్ వెంటనే చెల్లించాలి!

- **విశ్రాంత ఉద్యోగుల వేదన వ్యక్తం చేసిన రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు**

**పెద్దపల్లి, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు సంస్థ లాభాల వాటా మరియు దీపావళి బోనస్‌ను తక్షణమే చెల్లించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నాడు పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడా ఓయూ కాలనీలో సమావేశమైన రిటైర్డ్ ఉద్యోగులు మాట్లాడుతూ, గత నెల 29న ప్రస్తుత ఉద్యోగులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 34 శాతం లాభాల వాటా చెల్లించడంతో వారు ఉత్సాహంగా దసరా పండుగ జరుపుకున్నారని గుర్తు చేశారు.

ప్రతి సంవత్సరం దీపావళికి చెల్లించే పి.ఎల్.ఆర్ (దీపావళి) బోనస్ రూ.1,03,000ను ఈ నెల 17న చెల్లిస్తామని యాజమాన్యం ప్రకటించినప్పటికీ, రిటైర్డ్ ఉద్యోగులకు మాత్రం చెల్లింపులు ఆలస్యం అవడం విచారకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

30-40 సంవత్సరాలు సింగరేణి అభివృద్ధికి కృషి చేసిన మాకు ఇప్పుడు లభించాల్సిన లాభాల వాటా, బోనస్ కోసం వేచి చూడాల్సి రావడం బాధాకరం అని వారు పేర్కొన్నారు. సాంకేతికంగా అగ్రగామిగా ఉన్న సంస్థ క్షణాల్లో గణాంకాలను సమర్పించగలదని, అయినప్పటికీ రిటైర్డ్ ఉద్యోగుల చెల్లింపుల్లో జాప్యం ఎందుకని ప్రశ్నించారు.

ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగులకు కూడా ఒకే తేదీన దీపావళి బోనస్, లాభాల వాటా చెల్లించి, రిటైర్డ్ కుటుంబాల్లో దీపకాంతులు వెదజల్లాలని యాజమాన్యాన్ని కోరుతున్నట్లు అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ తెలిపారు.

ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులు కంచ బీరయ్య, గీస కనకయ్య, పొగాకు రవీందర్, ఎం.డి. రఫీక్ అహ్మద్, కె.జి. రాజు తదితరులు పాల్గొన్నారు.






# ప్రజా సేవలలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- **మున్సిపల్ కమిషనర్ జె. అరుణ శ్రీ**

**పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్16 (డీడీ9 వార్త):**

రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలకు మున్సిపల్ సేవలు సమర్థవంతంగా అందించేందుకు వార్డు అధికారులు మరింత అంకిత భావంతో పని చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం మున్సిపల్ కమిషనర్ జె. అరుణ శ్రీ సూచించారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆస్తి పన్ను మరియు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు లక్ష్యాల ప్రకారం వసూలు చేయాలని సూచించారు. భారీ బకాయిలు ఉన్న వారికి రెవెన్యూ రికవరీ చట్టం క్రింద నోటీసులు జారీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజన్‌లలో పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా జరిగేలా చూడాలని, మున్సిపల్ సేవలకు సంబంధించి ప్రజలు దృష్టికి తెచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చూడాలని ఆమె సూచించారు. అదనంగా, నిషేధిత ప్లాస్టిక్ వినియోగం గుర్తించిన సందర్భంలో సంబంధిత మెటీరియల్ స్వాధీనం చేసుకొని జరిమానాలు విధించాలని కమిషనర్ ఆదేశించారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే వారిపై అపరాధ రుసుము వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ మారుతి ప్రసాద్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్.ఓ ఆంజనేయులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, ఆర్.ఐలు శంకర్ రావు, ఖాజా, వార్డు అధికారులు, వార్డు అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



## ఆకెనపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ పనులకు శుభారంభం

- **ప్రజా సేవలో ముందుండే నాయకుడు – గాదె సుధాకర్**

**పెద్దపల్లి/అంతర్గం, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

రామగుండం నియోజకవర్గం లోని అంతర్గం మండలం ఆకెనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ గాదె సుధాకర్ శుభారంభం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సంకల్పం మేరకు, రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల ప్రకారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బరిగల స్రవంతి-సతీష్, శ్రీరాముల విజయ-సత్తయ్యల ఇళ్ల స్లాబ్ పనులు ప్రారంభించబడ్డాయి. సుధాకర్ ప్రజల అభివృద్ధి, గృహనిర్మాణం, పేదల సంక్షేమం పట్ల ఎల్లప్పుడూ శ్రద్ధ చూపుతూ, ప్రజలతో కలసి పనిచేసే నాయకుడిగా నిలిచారు. ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ ప్రియశిష్యుడైన గాదె సుధాకర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంకల్పాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి, సామాజిక సేవ, ప్రజా సంక్షేమం పట్ల ఆయన చూపుతున్న అంకితభావం ఆకెనపల్లి ప్రజల్లో విశేష ఆదరణ పొందుతోంది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మర్రి రాజకుమార్, మాజీ సర్పంచ్ గంగాధర్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంతిని మహేందర్, మహిళా నాయకురాళ్లు ఐలవేణి అనసూర్య, పిట్టల మంజుల, ఐలవేణి లక్ష్మి, ఐలవేణి రమ, బరిగల గట్టయ్య, మేస్త్రి సున్నం కనుకయ్య మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు పదోన్నతులు కల్పించాలి

- **సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ బీఎంఎస్ డిమాండ్**

**పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పదోన్నతులు కల్పించాలని సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ బీఎంఎస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ రోజు సాయంత్రం రామగుండం ఆర్జి 1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ కు యూనియన్ తరపున మెమోరాండం అందజేశారు. అనంతరం సంఘ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య మాట్లాడుతూ, అన్‌స్కిల్డ్‌గా పనిచేస్తున్న కార్మికులకు సెమిస్కిల్డ్ వేతనాలు, సెమిస్కిల్డ్‌గా పనిచేస్తున్న వారికి స్కిల్డ్ వేతనాలు, స్కిల్డ్ కార్మికులకు హైలీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు సింగరేణి సంస్థ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని, కానీ వేతనాలు, పదోన్నతుల విషయంలో న్యాయం జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు బీఎంఎస్ యూనియన్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గుండెబోయిన భూమయ్య, చిగురు లక్ష్మణ్, గొడుగు సమ్మయ్య, గూడెపు వినోద్, సుంకరి సురేష్, సాయి భరత్, భూసారపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల సక్సెస్‌కు కేరాఫ్ నారాయణ విద్యాసంస్థలు

- **మాస్టర్ ఓరియెంటర్ కాంటెస్ట్ ఘనంగా నిర్వహణ**

**పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

గోదావరిఖని మార్కండేయ కాలనీలోని నారాయణ పాఠశాలలో నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో మాస్టర్ ఓరియెంటర్ కాంటెస్ట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణ పాఠశాలల ఏజీఎం చైతన్య రావు, చాంప్స్ ఆర్ అండ్ డి హెడ్ స్వాతి లక్ష్మి, సాఫ్ట్ స్కిల్స్ లీడ్ గీత కుమారి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కరీంనగర్ జోన్ పరిధిలోని గోదావరిఖని, మంచిర్యాల, కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల, జగిత్యాల నారాయణ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ప్రదర్శనా ప్రతిభను చూపుతూ నృత్యాలు, పాటలు, ఆటలతో వేదికను కట్టిపడేశారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ నైపుణ్యం పెంపొందించడమే ఈ పోటీల ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జోన్ ఏజీఎం చైతన్య రావు, ఆర్.ఐ. సత్యం రావు, ప్రిన్సిపాళ్లు రజని, భాస్కర్ రెడ్డి, స్రవంతి, రమ్య, క్రాంతి పాల్, శాంతి కిరణ్, వైస్ ప్రిన్సిపాళ్లు, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.







## మార్కండేయ శివాలయంలో కార్తీకమాస లక్ష దీపోత్సవానికి సన్నాహకాలు ప్రారంభం

- **ఉత్సవ కమిటీ సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు**

**పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**



గోదావరిఖని మార్కండేయ కాలనీలోని మార్కండేయ శివాలయ ఆవరణలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీ మంచికట్ల బిక్షపతి గారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే కార్తీకమాసంలో లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు.

ఉత్సవ కమిటీ నిర్ణయించిన ప్రకారం నవంబర్ 1వ తేదీ (శనివారం) నుండి నవంబర్ 5వ తేదీ (బుధవారం) వరకు ఐదు రోజులపాటు ప్రతిరోజూ సాయంత్రం 6.00 గంటలకు లక్ష దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సంబంధించి పలు తీర్మానాలు ఆమోదించడంతోపాటు బాధ్యతలను సభ్యులకు అప్పగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చక్కగా చేయాలని నిర్వాహకులు సూచించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ దుగ్గిరాల రాఘవాచార్యులు మాట్లాడుతూ, ఈ కార్తీకమాస దీపోత్సవం ద్వారా భక్తులు శివకృపను పొందగలరని తెలిపారు. సభలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు శ్రీ మంచికట్ల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి శ్రీ బండారి రాజమల్లు, కోశాధికారి శ్రీ గద్దం రవి, ముఖ్య సలహాదారు శ్రీ కొండి లక్ష్మీపతి, ఆలయ అర్చకులు శ్రీ దుగ్గిరాల రాఘవాచార్యులు, కానుగంటి నారాయణ, తాటిపాముల రాజేష్, లెంకల రాజిరెడ్డి, బోయిని కొమరయ్య, నగునూరి రమేష్, సిరిపురం రమేష్, మాటేటి సతీష్, బొడ్డుల వేణు, లెంకల వీరారెడ్డి, కోలేటి కిషన్, దారా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు ఈ సందర్భంగా భక్తజనులను లక్ష దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొని శివుడి ఆశీస్సులు పొందాలని ఆహ్వానించారు. అలాగే, ఈ ఉత్సవానికి ధన, వస్తు రూపంలో విరాళాలు అందజేయాలనుకునే దాతలు శ్రీ దుగ్గిరాల రాఘవాచార్యులు గారిని సంప్రదించాలని తెలిపారు.

## బీసీ బంద్‌కి ఎన్.ఫ్.ఐ.డబ్ల్యు మద్దతు

- **బీజేపీ ఎంపీలు రాజీనామాచేయాలని డిమాండ్**
- **బీసీ రిజర్వేషన్ల రద్దు యత్నాలను వ్యతిరేకిస్తూ తీవ్ర విమర్శలు**

**పెద్దపల్లి, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్.ఫ్.ఐ.డబ్ల్యు) రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను రద్దు చేసే కుట్రలు పన్నుతోందని తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా ఎన్.ఫ్.ఐ.డబ్ల్యు పెద్దపల్లి జిల్లా గౌరవాధ్యక్షురాలు మడికొండ ఓదమ్మ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయలక్ష్మి, ఆసాల రమ, ఉపాధ్యక్షురాలు యాసర్ల తిరుమల, నగర నాయకులు రాళ్లు గోసిక రాజేశ్వరి, దుబాసి రేణుక, చింతల సుజాత, కటుకూరి భాగ్యలక్ష్మి, ఎం.డి. నస్రిన్ తదితరులు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అగ్రకుల దురహంకారంతో బీసీ రిజర్వేషన్లను బలహీనపర్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో 42% బీసీ రిజర్వేషన్ సాధన కోసం బీసీ జేఏసీ పిలుపునిచ్చిన ఈనెల 18న బంద్‌కి ఎన్.ఫ్.ఐ.డబ్ల్యు మద్దతు ప్రకటించారు. వారు మాట్లాడుతూ... “అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించిన 42% రిజర్వేషన్ బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించి ఉంటే హైకోర్టు దాన్ని కొట్టివేసేది కాదు. దీనికి పూర్తి బాధ్యత బీజేపీదే. ప్రజలు బీజేపీని గద్దె దించాలని సమయం ఆసన్నమైంది,” అన్నారు. అలాగే, రాష్ట్రంలో ఉన్న 8 మంది బీజేపీ ఎంపీలు బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్రాన్ని ఒప్పించకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. వెంటనే బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బంద్ విజయవంతం కావడానికి ఎన్.ఫ్.ఐ.డబ్ల్యు తమ మద్దతుతోపాటు ప్రత్యక్షంగా పాల్గొంటామని తెలిపారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాల బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

NFIW

# పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలో 24 గంటల అధునాతన వైద్య సేవలు

- 50 పడకల నుండి 100 పడకలకు పెంపు
- పేదలకు మెరుగైన వైద్యసేవలు
- ప్రభుత్వ ఆసుపత్రి ప్రసూతి ప్రక్రియ ఆడబిడ్డలకు పుట్టినిల్లుగా మారింది
- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పర్యటన

**పెద్దపల్లి, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల అధునాతన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. ఈ రోజు ఆసుపత్రిని సందర్శించిన అనంతరం వైద్య శాఖ అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ ఆసుపత్రిలో సేవల నాణ్యత గణనీయంగా మెరుగుపడిందని పేర్కొన్నారు. గతంలో 50 పడకలతో ఉన్న ఆసుపత్రిని ఇప్పుడు 100 పడకల దవాఖానగా విస్తరిస్తున్నామని తెలిపారు. ముందుగా ప్రతి రోజు ఒక్కో రంగు బెడ్‌షీట్‌ల వినియోగాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ... ఇది రాష్ట్రంలోనే తొలిసారిగా అమలు చేస్తున్న పద్ధతి అని చెప్పారు. ఈ విధానం వల్ల రోగులకు శుభ్రమైన బెడ్‌షీట్లు అందుతాయని తెలిపారు. ఆయన మాట్లాడుతూ, "గత నెలలో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి సేవల విషయంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. సెప్టెంబర్ నెలలో 250 మంది గర్భిణీ స్త్రీలకు ప్రసూతి సేవలు, 26,730 ఓపి సేవలు, 123 మందికి టీఫా స్కానింగ్, అలాగే 316 మందికి ఆరోగ్యశ్రీ సేవలు అందించాం" అని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సహకారంతో, ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే వైద్య సేవలు ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సేవల ద్వారా ప్రతి నెల దాదాపు రూ.7.04 కోట్ల వరకు ప్రజలకు ఆర్థిక ఆదా జరుగుతోందని చెప్పారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రారంభిస్తామని తెలిపారు. వెంటిలేటర్లు, ఎమ్ఆర్ఐ, సిటి స్కాన్ వంటి అధునాతన పరికరాల కోసం సుమారు రూ.20 కోట్ల విలువైన ఎక్విప్‌మెంట్ ఆర్డర్ చేస్తున్నామని చెప్పారు. "మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు కూడా త్వరలో ఇక్కడే చేస్తాము. ఏ రోగి కూడా అసంతృప్తితో ఇంటికి వెళ్ళకూడదు. వైద్య సిబ్బంది అందరూ జవాబుదారీతనంతో పని చేయాలి" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తర్వాత కొత్తగా నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రి పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారులు, డాక్టర్లు, మార్కెట్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.






# 42%బీసీ రిజర్వేషన్ కోసం అక్టోబర్ 18న భద్రాచలంలో సంపూర్ణ బంద్‌కు బీసీ ఐక్యవేదిక పిలుపు!

- అఖిలపక్షాల మద్దతుతో బంద్ విజయవంతం చేస్తాం: బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు బొలిశెట్టి రంగారావు

**భద్రాచలం అక్టోబర్ 16 (డిడి9 వార్త):**

భద్రాచలంలో అక్టోబర్ 16 గురువారం సాయంత్రం 6 గంటలకు కాంట్రాక్టర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం ఘనంగా జరిగింది. 62 శాతం జనాభా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు బొలిశెట్టి రంగారావు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "42 శాతం రిజర్వేషన్ కోసం బీసీలు పోరాటం చేస్తుంటే, అగ్రవర్ణ నాయకులు దానిని తప్పుదారి పట్టించాలని చూస్తున్నారు. ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ, బీసీలను అయోమయానికి గురిచేయాలని ప్రయత్నిస్తున్నారు. కానీ బీసీలు అన్ని విషయాలను తెలివిగా గమనిస్తున్నారు" అని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ అంశం నిలిచిపోయిన నేపథ్యంలో, బీసీ జేఏసీ రాష్ట్రస్థాయి నుంచి వచ్చిన పిలుపు మేరకు, అక్టోబర్ 18, 2025న సంపూర్ణ బంద్‌ను నిర్వహించబోతున్నట్లు రంగారావు ప్రకటించారు. అఖిలపక్షాల సహకారంతో ఈ బంద్‌ను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. బీసీ సోదరులు, అఖిలపక్ష నాయకులు, వ్యాపార వర్గాలు, మేధావులు ఈ బంద్‌కు మద్దతు పలకాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు గద్దం స్వామి, బండారు శరత్ బాబు, సీపీఐ నాయకులు శ్రీనివాస్, మాస్ లైన్ నాయకురాలు పెచ్చల కల్పనక్క, శివ, బీసీ గౌరవాధ్యక్షులు టీవీ గారు, ప్రధాన కార్యదర్శి బండారు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు అను గోజు నరసింహ చారి, సహాయ కార్యదర్శి మేకల మల్లు బాబు యాదవ్, కోశాధికారి కోపనాతి శాంతారావు, పద్మశాలి నాయకులు అనుమల గంగాధర్, సంఘం నాయకులు ఏ కుల రామచంద్ర రావు, ముదిరాజ్ సంఘం నాయకులు రాగం నిర్మలానందం, అగ్నికుల క్షత్రియ నాయకులు ప్రచార కార్యదర్శి పున్నయ్య, మల్లాడ శ్రీధర్, మల్లాడి చక్రి సుబ్బారావు, శోభన్ బాబు, గణేష్ పాల్గొన్నారు.



# భద్రాచలం ఆర్టీసీ కండక్టర్ గుండెపోటుతో మృతి

- విధి నిర్వహణలో విషాదం
- టికెట్లు ఇస్తుండగా అకస్మాత్తుగా ఛాతీ నొప్పి

**దుమ్ముగూడెం అక్టోబర్ 16 (డిడి9 వార్త )**

భద్రాచలం ఆర్టీసీ డిపోకు చెందిన సైదులు కండక్టర్ గురువారం ఉదయం విధి నిర్వహణలో గుండెపోటుతో మరణించారు. మృతుడిని మధిర గ్రామానికి చెందిన సైదులుగా గుర్తించారు.

వివరాల్లోకి వెళ్తే...గురువారం ఉదయం భద్రాచలం నుంచి వెంకటాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో కండక్టర్ సైదులు ప్రయాణికులకు టిక్కెట్లు ఇస్తుండగా అకస్మాత్తుగా ఛాతీలో తీవ్ర నొప్పి రావడంతో వెంటనే అప్రమత్తమై తన కండక్టర్ సీటులో కూర్చొని ఆయన డ్రైవర్‌కు విషయం తెలియజేశారు. డ్రైవర్ తక్షణమే బస్సును పక్కకు ఆపి, సమీపంలోని పీహెచ్‌సీకి వైద్యం కోసం తరలించారు. పీహెచ్‌సీలోని వైద్యులు కండక్టర్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈ విషయం తెలుసుకున్న భద్రాచలం ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ (డీఎం) జంగయ్య, సీఐ రామయ్య, పోకల సురేష్‌లు వెంటనే భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. కండక్టర్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూపర్డెంట్‌ను కోరారు.

అయితే, భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకున్న వెంటనే కండక్టర్‌ను పరీక్షించిన వైద్యులు, ఆయన దారి మార్గంలోనే మరణించినట్లుగా నిర్ధారించారు. కండక్టర్ గుండెపోటు కారణంగానే మరణించినట్లు వైద్యులు స్పష్టం చేశారు.

కండక్టర్ మృతితో అతని కుటుంబంలో, స్వగ్రామమైన మధిరలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. డీఎం జంగయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్‌తో మాట్లాడి, కండక్టర్ సైదులు పార్థివ దేహాన్ని పార్థివ వాహనంలో మధిరకు తరలించారు. అంతేకాక, మృతుడు సైదులు దహన సంస్కారాల కోసం డీఎం జంగయ్య మృతుడి భార్యకు తక్షణ సహాయంగా రూ. 30,000 నగదు అందజేశారు.



# రూ. 8 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన నల్లగొండ ఫైర్ ఆఫీసర్

- - లంచం తీసుకుంటూ పట్టుబడిన అగ్నిమాపక శాఖ అధికారి

**నల్లగొండ అక్టోబర్ 16 ( డిడి9 వార్త )**

బాణసంచా దుకాణం నిర్వహణకు సంబంధించి తాత్కాలిక లైసెన్స్ జారీ ప్రక్రియలో భాగంగా రూ.8,000/ లంచం స్వీకరిస్తూ నల్లగొండ ఫైర్ స్టేషన్ అధికారి ఏ. సత్యనారాయణ రెడ్డిని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

వివరాల్లోకి వెళితే, ఒక ఫిర్యాదుదారుడు తన బాణసంచా దుకాణానికి తాత్కాలిక లైసెన్స్ పొందేందుకు అగ్నిమాపక శాఖ (ఫైర్ డిపార్ట్‌మెంట్) నుండి నిరభ్యంతర ధృవీకరణ పత్రం (NOC) కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు గాను, స్టేషన్ అధికారి ఏ. సత్యనారాయణ రెడ్డి ఫిర్యాదుదారుడిని రూ.8,000/ లంచం డిమాండ్ చేసినట్లుగా ఏసీబీకి ఫిర్యాదు అందింది. దీంతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ఉచ్చు పన్ని, ఫిర్యాదుదారుడి నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో అధికారి సత్యనారాయణ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అవినీతికి పాల్పడే ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఏసీబీ స్పష్టం చేసింది.

**-- ఏసీబీ విజ్ఞప్తి**



ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే, ప్రజలు వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయవచ్చని, లేదా వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (Telangana ACB), ఎక్స్ (@TelanganaACB) ద్వారా లేదా వెబ్‌సైట్ (acb.telangana.gov.in) ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఏసీబీ అధికారులు హామీ ఇచ్చారు

# 18న జరుగు బంద్ కు బీఆర్ఎస్ పార్టీ మద్దతు

**మణుగూరు, అక్టోబర్ 15, డిడి 9 వార్త**



కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను 42 శాతం రిజర్వేషన్ పేరుతో మోసగించిదని ఎలాగైతే కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో, ఈ ఫార్ములా కార్ రేస్ పేరుతో , అలాగే ఫోన్ ట్యాపింగ్ పేరుతో ఈ ప్రభుత్వం కాలయాపన చేసిందో.. అలాగే బీసీలకు ఇచ్చిన 42% రిజర్వేషన్ న్యాయస్థానాల పేరుతో కాలయాపన చేస్తున్నందున దీనికి నిరసనగా ఈనెల 18న బీసీ సంఘాలు పిలుపునిచ్చినటువంటి తెలంగాణ బంద్ కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు తెలిపారు. కావున ఈ బంద్ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనవలసిందిగా పిలుపునిస్తున్నాను.




# మత్తుకు అలవాటుపడి బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దు: ఎస్ఐ మేడ ప్రసాద్

**బూర్గంపహాడ్ అక్టోబర్ 16 డిడి9 వార్త**

విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని, మత్తుకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని బూర్గంపహాడ్ స్థానిక ఎస్ఐ మేడ ప్రసాద్ హితవు పలికారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చిన్నా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ మేడ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని యువతను ఉద్దేశించి మాట్లాడారు.

యువత మంచి నడవడికతో మెలగాలని, హానికర పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మంచి చదువుతో పాటు మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై జిల్లా పోలీసు శాఖ తరపున నిత్యం అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ చిన్నా మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాలు లాంటి చెడు వ్యసనాలకు బానిసలై తమ అమూల్య జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని, ఆ లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని సూచించారు. మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్ వంటివి తీసుకుంటే ఆరోగ్యంపై హానికర ప్రభావాలు పడటంతో పాటు ఆర్థిక నష్టాలు, సమాజంలో గుర్తింపు, గౌరవం కోల్పోతారని హెచ్చరించారు. డ్రగ్స్ నిర్మూలన పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్తు అందించాలని పిలుపునిచ్చారు. అదనపు ఎస్ఐ ఈ. నాగభిక్షం మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ దశ చాలా కీలకమైనదని, ఈ సమయంలో విద్యార్థులు తీసుకునే నిర్ణయాలపైనే వారి జీవితం ముడిపడి ఉంటుందన్నారు. విద్యార్థులు మంచి నడవడికతో చదువుతూ మంచి పేరు ప్రఖ్యాతలు అందుకోవాలని, మత్తు పదార్థాలకు, గంజాయికి దూరంగా ఉంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిన్నా, స్థానిక ఎస్ఐలు మేడ ప్రసాద్, నాగభిక్షం, సీనియర్ అధ్యాపకులు సిహెచ్ నాగేశ్వరావు, ఎన్ఎస్ఎస్ పివో జి. శ్రీనివాస్, అధ్యాపక బృందం, కానిస్టేబుల్ లు పిచ్చయ్య, రాము, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఇసుక అక్రమ రవాణా ముఠా అరెస్టు

- **ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**
- **పరారీలో నకిలీ వెబిల్స్ తయారీదారుడు, లారీ ఓనర్, ఇసుక ర్యాంపు సూపర్వైజర్**

**అశ్వాపురం, అక్టోబర్ 15, డిడి9 వార్త**

ఇసుక అక్రమ రవాణా చేసిన వ్యక్తులను అదుపులో తీసుకొని రిమాండ్ చేసినట్లు మణుగూరు సబ్ డివిజన్ డిఎస్పి రవీందర్ రెడ్డి తెలిపారు. గురువారం అశ్వాపురం పోలీస్ స్టేషన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత ఎనిమిదవ తేదీన జగ్గారం క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా టీఎస్ 30 టిఏ 6498 అనే నంబర్ గల లారీ ఇసుక లోడుతో రాగా దానిని తనిఖీ చేయగా దాని డ్రైవర్ నాతి రాములు వే బిల్లును చూపిస్తాడని, దాని పై అనుమానం వచ్చి గట్టిగా అడగగా అది నకిలీ వే బిల్ అని దాన్ని తమ ఓనరు హైదరాబాద్ నకు చెందిన కర్నాటి శివశంకర్ ఇచ్చి పంపినాడని, డ్రైవర్ చెబుతాడన్నారు. అలాగే రామానుజవరం ర్యాంపులో ఒక వ్యక్తి తనకు డిడి లేకుండా ఇసుక లోడ్ చేసినాడని, దీనిపై లారీని సీజ్ చేసి cr. no. 189/2025 U/Sec 318(4),336(2), 340(2),r/w 3 (5) of బి.ఎన్.ఎస్, కేసు నమోదు చేసామన్నారు. రామానుజవరం ఇసుక ర్యాంపు నందు తనిఖీ చేయగా అక్కడ పనిచేసే టీజీఎండిసి కి సంబంధించిన ముగ్గురు ఉద్యోగులు దగ్గు నిఖిల్ దీప్, నాగేల్లి మధు, బుల్లెద్దు అనిల్ అనువారు డిడి లేకుండా ఇసుకను లారీలో లోడ్ చేసినారని అలాగే ఇసుకను లోడ్ చేసే జెసిబి డ్రైవర్ ఇరగదిండ్ల ఉపేందర్ దానిని లోడ్ చేసినాడని అతనికి లోడ్ చేయమని ర్యాంపులో సూపర్వైజర్ గా పని చేసే సతీష్ రెడ్డి ఫోన్ చేసి లోడ్ చేయమని చెబుతాడని తెలిపారు. అలాగే కర్నాటి శివ శంకర్ గురించి తెలుసుకొని హైదరాబాద్ హయత్ నగర్ లోని అతని ఇంటి వద్దకు వెళ్లగా నేరం ఒప్పుకొని వే బిల్లులు తానే తయారు చేసే వాడిని దానికి ఉపయోగించే లాప్టాప్, ప్రింటర్ అలాగే రామానుజవరం సంబంధించిన స్టాంపును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. శివశంకర్ తనకు వే బిల్లు తయారు చేయడంలో తన ఊరు సంస్థాన్ నారాయణపురం మండలం యాదాద్రి భువనగిరి జిల్లా పుట్టపాకకు చెందిన కిరణ్ అనే అతను వే బిల్లులు తయారు చేయడం నేర్పించినాడని తెలిపారు. అంతకు ముందు కిరణ్ పై 2023వ సంవత్సరంలో నకిలీ వే బిల్లుల తయారు చేసినందుకు వరంగల్ జిల్లా మట్వాడ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయి జైలుకు కూడా వెళ్లినాడని తెలిపారు. తాను కిరణ్ కలిసి పలు రీచ్లకు సంబంధించిన నకిలీ వే బిల్లులు తయారు చేసి పలు మార్లు ఇసుక అక్రమ రవాణా చేసినామని చెప్పినట్టు ఆయన తెలియజేశారు.

**అరెస్టు కాబడిన వ్యక్తుల వివరాలు..**

ఏ1 కర్నాటి శివ శంకర్, ఏ4). నాతి రాములు, ఏ5) ఇరగదిల్ల ఉపేందర్, ఏ6) దగ్గు నిఖిల్ దీప్, ఏ7) నాగెల్లి మధు, ఏ8) బోల్లేదు అనిల్ 41 ఇయర్స్ టీజీఎండిసి సెక్యూరిటీ గార్డ్

**పరారీలో ఉన్నవారు..**


ఏ2 ఈ.కిరణ్ (వే బిల్లు తయారు చేసిన వ్యక్తి)

ఏ3 సతీష్ రెడ్డి ( రామానుజవరం ఇసుక ర్యాంపు), ఏ9 సుర్వే శ్రీకాంత్ (లారీ ఓనర్) గా గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా నకిలీ వే బిల్లులతో ఇసుక అక్రమ రవాణా చేసినా, చేయాలని ప్రయత్నించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కేసులో ఇంకా కొంతమంది అరెస్టు కావలసి ఉన్నందున ఈ కేసులో ఎవరికైనా ప్రమేయం ఉంటే వారిని అరెస్టు చేయడం జరుగుతుంది. ఈ కేసుకు సంబంధించిన వివరములు గాని నకిలీ వే బిల్లుల గురించిన వివరములు గాని ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే అశ్వాపురం సీఐ 8712682093, లేదా ఎస్డిపిఓ మణుగూరు సెల్ నెంబర్. 8712682006 సంప్రదించాలని కోరారు.

# విద్యాశాఖ అధికారి ఆకస్మిత తనిఖీ

**వాజేడు అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

మండల పరిధి లో ఉన్నటువంటి పాఠశాలలను గురువారం మండల విద్యాశాఖ అధికారి తేజావత్ వెంకటేశ్వరావు ఆకస్మిత తనిఖీ నిర్వహించారు ఉదయం 9 గంటలకు ఎంపిపియస్ వాజేడు పాఠశాలకు ప్రార్థన సమయంలో హాజరయ్యి తర్వాత ఎంపీపీయస్ మురుమూరు కాలనీ, ఎంపీపీయస్ మురుమూరు, పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులు బోధిస్తున్న బోధనను పర్యవేక్షించారు ఎఫ్ఎల్ఎన్ లో భాగంగా ప్రతి ఉపాధ్యాయుడు కూడా టిఎల్ఎంలు ఉపయోగించాలని సూచించారు విద్యార్థులు యొక్క అభ్యసన సామర్థ్యం పెంపొందించాలని ప్రతి ఉపాధ్యాయుడు కూడా వర్క్ పుస్తకాలను అనుసరించి పిల్లల్లో నైపుణ్యాలను పెంపొందించాలని అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కూడా టీచింగ్ డైరీ రాయాలని విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు తర్వాత ఎంపీపీయస్ బిజినేపల్లి, ఎంపిపియస్ ప్రగల్లపల్లిని సందర్శించి విద్యార్థుల యొక్క నైపుణ్యాలను బోధన ద్వారా పెంపొందించాలని ఈ సందర్భంగా తెలియజేసేరు వాజేడు మండలంలో ఉపాధ్యాయుల యొక్క ఎఫ్ఆర్ఎస్ వంద శాతం నమోదైందని తెలిపారు పిల్లలు యొక్క ఎఫ్ ఆర్ ఎస్ నందు 73.59 శాతం హాజరు ఉందన్నారు





# అమీర్‌పేట ముంపునకు "హైడ్రా" పరిష్కారం

- **నగర వ్యాప్తంగా ఇదే విధానం**
- **నాలాల డీసిల్టింగ్ పనులు పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్**

**హైదరాబాద్, అక్టోబర్ 16(డిడి 9 వార్త):**



వర్షం వస్తే ఆందోళన పది సెంటీమీటర్ల వర్షం పడితే రహదారులన్నీ జలమయం. ఇక అమీర్‌పేట గురించి ప్రత్యేకంగా చెప్పాలా.. జూబ్లీహిల్స్, గాయత్రీ హిల్స్, యూసుఫ్‌గూడ, కృష్ణానగర్, మదురానగర్, శ్రీనివాస నగర్ ప్రాంతాల నుంచి వచ్చే వరద ముందుకు సాగక అమీర్‌పేటలో నడుం లోతు నీళ్లు ప్రధాన రహదారిపై నిలిచిపోవడం.. వాహన రాకపోకలకు ఇబ్బంది కలగడం.. ఇవన్నీ నగరవాసులకు ప్రతి ఏటా అనుభవంలోకి వచ్చిన వరద కష్టాలే. ఈ ఏడాది ఆ సమస్యకు హైడ్రా పరిష్కారం చూపింది. వరద కష్టాలకు తెర దించింది. ఇప్పుడు 10 సెంటీమీటర్ల వర్షం పడితే నీరు నిలవకుండా ముందుకు సాగేలా హైడ్రా చర్యలు తీసుకుంది. ఈ పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నిరంతరం పర్యవేక్షించారు. హైడ్రా, జీహెచ్ ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ అధికారులతో పలుమార్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కార మార్గం చూపారు. ఈ క్రమంలోనే గురువారం కూడా అమీర్‌పేటలో పర్యటించి పూడుకుపోయిన నాలాలనుంచి మట్టిని, చెత్తను తొలగించే పనులను పర్యవేక్షించారు.

**అమీర్‌పేట ఓ నమూనా..**

అమీర్‌పేటలో వరద ముప్పు తప్పించేందుకు అనుసరించిన విధానం నగరంలోని అనేక ముంపు ప్రాంతాలకు పరిష్కార మార్గమని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు తెలిపారు. పూడుకుపోయిన నాలాలను ఇదే మాదిరి తెరిస్తే చాలావరకు వరద సమస్యకు పరిష్కారం చూపగలమని చెప్పారు. హైడ్రాకమిషనర్ ఏ.వి. రంగనాథ్ అమీర్‌పేట్‌లోని మైత్రివనం జంక్షన్, గాయత్రీ నగర్ ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మొత్తం 6 పైపులైన్లుండగా.. 3 లైన్లను పూర్తి స్థాయిలో పునరుద్ధణ పనులు పూర్తి చేసినట్టు అధికారులు కమిషనర్‌కు తెలిపారు. మరో 3 లైన్లలో పూడిక తీయడంతో పాటు.. ఈ వరదంతా గాయత్రీనగర్‌పై పడకుండా అక్కడ కూడా పైపులైన్లలో మట్టిని తొలగించే పనిని పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. వచ్చే వర్షాకాలానికి నీరు నిలవకుండా గాయత్రీ నగర్ కు ముంపు సమస్య లేకుండా చూడాలన్నారు.

**45 ట్రక్కుల మట్టి తరలింపు..**

అమీర్‌పేట జంక్షన్‌లో సారథీ స్టూడియోస్, మధురానగర్ వైపు నుంచి వచ్చే పైపులైన్లు కలుస్తాయి. ఎగువ నుంచి వరదతో పాటు భారీ మొత్తంలో చెత్త కూడా ఇక్కడకు చేరుతోంది. అలా దశాబ్దాలుగా చేరిన చెత్తతో అమీర్‌పేట జంక్షన్‌లో 6 పైపులైన్లు పూడుకుపోయి.. కొంతమొత్తంలోనే వరద నీరు ముందుకు సాగేది. ఏమాత్రం వర్షం పడినా వరద ముంచెత్తేది. శ్రీనివాస్‌నగర్ వెస్ట్ సైడ్ వరద కాలువ పైన కాంక్రీట్‌తో వేసిన పైకప్పు తెరచి పూడిక తీత పనులను హైడ్రా చేపట్టింది. పరుపులు, దిండులు ఇలా చెత్తతో మూసుకుపోయిన పైపులైన్లను తెరచింది. ఇప్పటి వరకూ ఇలా 45 ట్రక్కుల మట్టిని తొలగించింది. దీంతో ఈ ఏడాది 10 సెంటీమీటర్ల వర్షం పడినా ఇబ్బంది కలగలేదు. మరో 3 పైపు లైన్లలో కూడా పూడికను తొలగిస్తే 15 సెంటీమీటర్ల వర్షం పడినా అమీర్‌పేటలో వరద ముంచెత్తదని హైడ్రా, జీహెచ్ ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ అధికారులు కమిషనర్‌కు తెలిపారు. ఇదే మాదిరి నగరంలోని ముంపు సమస్యను ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో కల్వర్టులు, అండర్‌గ్రౌండ్ పైపు లైన్లలో పూడికను తొలగించి ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు సూచించారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు హైడ్రా బృందం చేపట్టిన పనుల పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

# ఇసుక లారీల ధ్వంసంపై అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమం..!

- **రోడ్లు బాగు చేయకుండా ఇసుక లారీలకు అనుమతిస్తే సడక్ బంద్ చేస్తాం: సీపీఐఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**
- **ఇసుక లారీల విధ్వంసంపై ప్రజాప్రతినిధులు మౌనం వీడాలి: తెలుగుదేశం మండల అధ్యక్షులు చిట్టిబాబు**
- **రహదారుల నిర్మాణం కొరకు ఎంతటి ఉద్యమానికైనా సిద్ధం: కెచ్చల కల్పన (సీపీఐఎంఎల్ మాస్ లైన్)**
- **రాజకీయాలకు అతీతంగా ఉద్యమాలు చేయాలి: భద్రాచలం పుర ప్రముఖులు**

**భద్రాచలం అక్టోబర్ 16 డిడి9 వార్త**




ఇసుక లారీల విధ్వంసంతో ధ్వంసమైన జాతీయ రహదారి పునర్నిర్మాణం కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని సీపీఐఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కలిసొచ్చే అన్ని పక్షాలను కలుపుకొని రహదారులను పునరుద్ధరించేంతవరకు నిరంతరాయ ఉద్యమాలు నిర్మించాలని, తాత్కాలికంగా ఆగిన ఇసుక లారీలను రోడ్లు బాగు చేయకుండా మళ్లీ అనుమతిస్తే 'సడక్ బంద్' నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ఆవరణలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య అధ్యక్షతన అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఇప్పటివరకు వివిధ రాజకీయ పక్షాలు పలు రూపాలలో ఉద్యమాలు నిర్వహించినప్పటికీ ప్రజా ప్రతినిధులు గానీ, అధికారులు గానీ స్పందించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రహదారుల నిర్మాణానికి సీపీఐఎం శ్రీకారం చుట్టిందని, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పలు రూపాలలో ఉద్యమాలు నిర్వహించాలని కోరారు.

**ప్రజాప్రతినిధులు మౌనం వీడాలి:**

గోదావరి నది నుండి ఇసుకను తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు రోడ్డుల విధ్వంసంపై మౌనం వీడాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తాళ్లూరు చిట్టిబాబు డిమాండ్ చేశారు. భద్రాచలంవెంకటాపురం జాతీయ రహదారి పూర్తిగా ధ్వంసం అయిపోయిందని, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. సీపీఐఎం చేస్తున్న ఈ మంచి ప్రయత్నానికి తెలుగుదేశం పూర్తిగా మద్దతిస్తుందని, అఖిలపక్ష పోరాటంలో భాగస్వామి అవుతుందని చిట్టిబాబు హామీ ఇచ్చారు.

**ఎంతటి పోరాటానికైనా సిద్ధం:**

ధ్వంసమైన రహదారుల నిర్మాణం కొరకు జరిగే పోరాటంలో సీపీఐఎంఎల్ మాస్ లైన్ పూర్తిగా భాగస్వామ్యం అవుతుందని, ఇసుక లారీల నియంత్రణకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని ఆ పార్టీ డివిజన్ నాయకురాలు కెచ్చల కల్పన స్పష్టం చేశారు. అధిక లోడులతో తిరిగే లారీల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, భద్రాచలం కేంద్రంగా జరిగే ఇసుక దందాను ప్రభుత్వ పెద్దలు ప్రోత్సహిస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం దిగివచ్చేంతవరకు ఉద్యమాలు ఐక్యంగా చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

**నరకయాతన అనుభవించాల్సి వస్తుంది:**

భద్రాచలం నుండి వెంకటాపురానికి ప్రయాణించాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తుందని కొండరెడ్ల సంఘం డివిజన్ నాయకులు రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి ఇసుక ర్యాంపులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతోనే జాతీయ రహదారి ధ్వంసమైందని, అత్యవసర వైద్యం కోసం భద్రాచలం రావాలంటే దారిలోనే ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇసుక ర్యాంపులను నిలిపివేసేంతవరకు పోరాటాన్ని కొనసాగించాలని, అఖిలపక్ష పోరాటానికి మద్దతిస్తామని హామీ ఇచ్చారు.

**ఇసుక దోపిడీ జరుగుతుంది:**

గతంలో ఎన్నడూ లేని విధంగా భద్రాచలం డివిజన్‌లో ఇసుక దోపిడీ జరుగుతుందని ప్రముఖ సంఘ సేవకులు గాదే మాధవరెడ్డి ఆరోపించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా రహదారుల పునర్నిర్మాణం కోసం జరిగే ఈ ఉద్యమానికి ప్రతి ఒక్కరు మద్దతుగా నిలవాలని, భద్రాచలం నియోజకవర్గ పరిరక్షణకు రాజకీయాలను పక్కనపెట్టి కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రముఖ న్యాయవాది పామరాజు తిరుమలరావు, వ్యాపారవేత్త మల్లికార్జునరావు, ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు మున్నాఫ్, రిటైర్డ్ పెన్షనర్స్ నాయకులు బందు వెంకటేశ్వర్లు, నాగభూషణం, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు పరిమి సోమశేఖర్, బీసీ ఐక్యవేదిక నాయకులు నరసింహ చారి, భద్రాచలం సొసైటీ అధ్యక్షులు అభినేని శ్రీనివాస్, మహాజన సమితి నాయకులు జి సుధాకర్ తదితరులు మాట్లాడుతూ, రహదారుల పునర్నిర్మాణం కోసం జరిగే ప్రతి పోరాటంలో కలిసొస్తామని హామీ ఇచ్చారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు భద్రాచలం పట్టణంలోకి లారీలు తిరగకుండా నియంత్రించాలని అధికారులను కోరాలని సూచించారు. అనంతరం ధ్వంశమైన ప్రధాన రహదారి పునర్నిర్మాణం కోసం జరిగే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా భాగస్వాములు కావాలని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది.



# పెళ్లికి నిరాకరించిన ప్రియుడు

- **కుమార్తెకు అన్యాయం జరిగిందని తల్లి ఆత్మహత్యాయత్నం**
- **గడ్డి మందు తాగి తీవ్ర అస్వస్థత, ఆసుపత్రికి తరలింపు**

**దుమ్ముగూడెం, అక్టోబర్ 16 (డిడి 9 వార్త)**

తనను ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో, తన కుమార్తెకు అన్యాయం జరుగుతుందన్న తీవ్ర ఆవేదనతో ఓ తల్లి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషాద సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ప్రస్తుతం ఆమె భద్రాచలం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దుమ్ముగూడెం మండలం లోని రేగుబల్లి గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి, అదే గ్రామానికి చెందిన కొండా వినోద్ అనే యువకుడితో గత నాలుగేళ్లుగా ప్రేమలో ఉంది. ఇటీవల యువతి పెళ్లి చేసుకోవాలని కోరగా, వినోద్ నిరాకరిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో, చేసేది లేక ఆ యువతి తన తల్లితో కలిసి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో యువకుడిపై ఫిర్యాదు చేసింది.

విచారణలో భాగంగా పోలీసులు బుధవారం వినోద్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. యువతిని ప్రేమించిన విషయం, ఆమె మూడు నెలల గర్భానికి ఆ యువకుడే కారణమన్న ఆరోపణలపై పోలీసులు విచారణ జరిపారు. అయితే, వినోద్ తనకు ముందుగానే పెళ్లి అయిందని, యువతిని పెళ్లి చేసుకునే ప్రసక్తే లేదని ఖరాఖండీగా పోలీసులకు చెప్పాడు.

వివాహం అయిన విషయంపై పోలీసులు విచారణ చేస్తుండగా, వినోద్ ఇద్దరు సోదరులు కూడా యువతి గర్భాన్ని తొలగించుకునేందుకు డబ్బు సమకూరుస్తామని బేరసారాలు ఆడినట్లు యువతి బంధువులు ఆరోపిస్తున్నారు. ప్రియుడి నిరాకరణ, కుటుంబ సభ్యుల తీరుతో కలత చెందిన యువతి తల్లి పోలీస్ స్టేషన్ నుంచి ఇంటికి వెళ్లి గడ్డి మందు తాగింది. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది.

వెంటనే గుర్తించిన కుటుంబీకులు, స్థానికులు హుటాహుటిన ఆమెను నరసాపురం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధిత మహిళకు భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. 48 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సమాచారం.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# క్రీడా పోటీలకు గిరిజన విద్యార్థులను సిద్ధం చేయాలి




- **ఐటీడీఏ పీఓ బి. రాహుల్ ఆదేశం**
- **డివిజన్ స్థాయిలో 17, 18 తేదీల్లో ఎంపికలు**

**భద్రాచలం అక్టోబర్ 16 డిడి 9 వార్త**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థులను ఈ నెలలో జరిగే డివిజనల్ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేలా చూడాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ సంబంధిత హెచ్ఎంలు, వార్డెన్లు, పీడీలు, పీఈటీలకు ఆదేశించారు. గురువారం నాడు ఒక ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు.

గిరిజన క్రీడల ఎంపిక పోటీలు ఐటీడీఏ భద్రాచలం పరిధిలో నిర్వహించబడుతున్న ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, వసతి గృహాల బాల, బాలికలకు జరుగుతాయని పేర్కొన్నారు.


జిల్లా స్థాయి గిరిజన క్రీడా పోటీల కోసం జిల్లాను దుమ్ముగూడెం, మణుగూరు, దమ్మపేట, పాల్వంచ, ఇల్లందు అనే 5 డివిజన్లుగా విభజించడం జరిగిందని తెలిపారు. ఈ డివిజనల్ స్థాయి క్రీడా ఎంపికలు ఆయా కేంద్రాల్లో ఈ నెల 17, 18 తేదీలలో నిర్వహించబడతాయని ఆయన వెల్లడించారు. సంబంధిత పీడీలు, పీఈటీలు విద్యార్థినీ విద్యార్థులను బాధ్యతగా క్రీడలు జరిగే సెంటర్లకు తీసుకొని వచ్చి, వారికి ఇష్టమైన క్రీడలలో తప్పనిసరిగా పాల్గొనేలా చేసి, ఈ క్రీడా ఎంపికలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# వాజేడు అడవుల్లో 'నెమలి' పోలికలతో వింత పక్షి సంచారం

- **రాత్రి వేళల్లో మనుషుల గొంతు శబ్దాలు**
- **పావురం సైజులో, ఎర్రటి కళ్ళతో దర్శనం.**
- **పురి విప్పుతూ క్షణాల్లో మాయం, చరవాణుల్లో బంధించిన యువకులు**

**వాజేడు అక్టోబర్ 16 డిడీ9 వార్త**

వాజేడు మండలంలోని గుమ్మడి దొడ్డి, ఇప్పగూడెం అటవీ మరియు వ్యవసాయ ప్రాంతాలలో ఇటీవల ఒక వింత పక్షి సంచరిస్తూ స్థానిక ప్రజలను అమితంగా ఆశ్చర్యపరుస్తోంది. అరుదైన లక్షణాలతో ఉన్న ఈ పక్షిని చూడడానికి స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. పావురం సైజులో ఉన్న ఈ పక్షి, అత్యంత ఆకర్షణీయంగా ఎరుపు రంగు కళ్లను కలిగి ఉంది. ముఖ్యంగా, ఇది నెమలి మాదిరిగా అప్పుడప్పుడు పురి విప్పుతూ, వెంటనే క్షణాల్లో ఎగిరి మాయమవుతుండడం మరింత విశేషం. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం, ఈ వింత పక్షి రాత్రివేళల్లో మనుషుల గొంతు లాంటి శబ్దాలు చేస్తోందని చెబుతున్నారు. గురువారం ఉదయం గుమ్మడి దొడ్డి, ఇప్పగూడెం ప్రాంతాలలో పొలాల్లో దుక్కులు దున్నుతున్న రైతులు ఈ పక్షిని గమనించారు. కొంతమంది యువకులు దానిని తమ చరవాణిల్లో చిత్రీకరించడానికి ప్రయత్నించారు. అయితే, ఫోటోలు తీస్తుండగా ఆ పక్షి అద్భుతంగా నెమలి లాగా పురి విప్పి, వెంటనే ఆకాశంలోకి ఎగిరిపోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ వింత పక్షి ఏ జాతికి చెందినదనే అంశంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. దీనిపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అటవీ శాఖ అధికారులు త్వరలో ఆ ప్రాంతాన్ని పరిశీలించనున్నారు.







# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- **డిఎస్పీ రవీందర్ రెడ్డి**

**మణుగూరు, అక్టోబర్ 15, డిడి9 వార్త**

మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్ నగర్లో "చైతన్యం" (డ్రగ్స్ పై యుద్ధం) లో భాగంగా మణుగూరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చైతన్యం (డ్రగ్స్ పై యుద్ధం) కార్యక్రమాలలో భాగంగా మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్ నగర్లో సుమారుగా 100 ఇండ్లలో సోదాలు నిర్వహించడం జరిగింది. సరిగా పత్రాలు లేకుండా నెంబర్ ప్లేట్లు లేని 58 ద్విచక్ర వాహనాలను, 05 ఆటోలను సీజ్ చేయడం జరిగింది. బెల్టు షాపులు నడుపుతున్న నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి 30,000/ రూపాయల విలువ గల మద్యాన్ని స్వాదీనం చేసుకున్నారు. డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనంతరం అశోక్ నగర్ వాసులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక మరియు సాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మట్కా, జూదం, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదని తెలిపారు. అదే విధంగా చైతన్యం పేరుతో చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా యువత డ్రగ్స్ మహమ్మారిన పడకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్దాల వలన కలిగే అనర్ధాల గురించి వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నేరాల నియంత్రణ కోసం తమ నివాస ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 100 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ములుగు జిల్లా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగే " బంద్ " జయప్రదం చేయండి...

- **జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా ఉపాఅధ్యక్షులు మంచర్ల నాగేశ్వరావు**

**అక్టోబర్ 16. డిడి 9 వార్త వెంకటాపురం( నూగురు)**

ములుగు జిల్లా జేఏసీ అధ్యర్యంలో జరిగిన సమావేశం లో JAC అధ్యక్షులు ముంజలా బిక్షపతి గౌడ్ పాల్గొని మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలు కోసం ప్రియమైన ST. SC. మైనార్టీ అనుబంధ సంఘాలు మరో తెలంగాణ ఉద్యమం, తరహా ఉద్యమ కార్యచరణకు శ్రీకారం చుట్టబోతున్నామని అన్నారు. కనీసం బీసీలకు జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్, ఎన్నికలలో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించరా అంటూ ప్రభుత్వాలను ప్రశ్నించారు. గత 30 ఏళ్ల నుండి బీసీల జనాభా గణనీయంగా పెరిగిన తగిన రిజర్వేషన్ లేక అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, కనీసం స్థానిక ఎన్నికలలోనైనా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయలేరా ఇదెక్కడి వ్యవస్థ అని అన్నారు. బీసీ ప్రజలు అందరు కలిసి ముక్తకంఠంతో పోరాటం చేయాలని అన్నారు. రాజకీయాలు ముఖ్యం కాదు, రాజ్యాధికారం బీసీలకు కావాలని, అగ్రకులాల అధిపత్యంలో బీసీలు నలిగిపోతున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలందరూ రాజకీయాలకతీతంగా కుల సంఘాలు, ప్రజా సంఘాలు ఐక్యతగా భావించి బందులో పాల్గొనాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ జేఏసీ నిర్వహించే బందును విజయవంతం చేయడానికి ములుగు జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో జరిగిన బీసీ జేఏసీ సమావేశానికి హాజరై 18. వ తారీకు న తెలంగాణ బంద్ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పోనుగోటి రవి, గోల్కొండ రాజు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా యూత్ అధ్యక్షులు తోటకూరి శ్రీకాంత్ గౌడ్. వెంకటాపురం మండల జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి బట్ట నాగేందర్. మల్లంపల్లి మండల అధ్యక్షులు జింక వేణు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజక వర్గ ఇంచార్జ్ బక్కి నవీన్. మహమ్మద్ బాబుల్, కుక్కల సంపత్, నారోజు అఖిల్. మహమ్మద్ ఖలీల్, భాస్కర్ గౌడ్, చింత నిప్పుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.











# ఫలించిన తుమ్మల కృషి..

- **ఎర్త్ సైన్సెస్ కు మన్మోహన్ సింగ్ పేరు ఖరారు..**
- **ముఖ్యమంత్రి "రేవంత్"కు ధన్యవాదాలు తెలిపిన తుమ్మల..**
- **కొత్తగూడెం కేంద్రంగా విశ్వవిద్యాలయం..**
- **ఆనందోత్సవాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, అక్టోబర్ 15, డిడి9 వార్త**

తెలంగాణ ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని భారత మాజీ ప్రధానమంత్రి, ఆర్థిక సంస్కరణల శిల్పి డా. మన్మోహన్ సింగ్ పేరుతో ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో "మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ" తెలంగాణ విద్యా చరిత్రలో ఒక మైలురాయి. రాష్ట్ర ప్రభుత్వం చూపిన దూరదృష్టి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుంది. ఈ నిర్ణయం వెలువడగానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు శుభాకాంక్షలు తెలిపారు.

**మైనింగ్ కళాశాల నుండి విశ్వవిద్యాలయం...**

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ దేశంలోనే ఎక్కడాలేని విధంగా 300 ఎకరాలలో విశ్వవిద్యాలయం రూపుదిద్దుకుంది. అయితే ఇప్పటికే కొత్తగూడెం మైనింగ్ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ "ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ"గా కాంగ్రెస్ ప్రభుత్వం మార్పు చేసింది. ఇప్పుడు విశ్వవిద్యాలయానికి మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం విద్యా వ్యవస్థలో తన దృష్టికోణాన్ని మరింత స్పష్టంగా ప్రభుత్వం తెలియజేసినట్టయింది.

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేష కృషి...**

ఎర్త్ సైన్సెస్ కళాశాలను డా. మన్మోహన్ సింగ్ పేరు మీద ఏర్పాటు చేయడంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చడంలోనూ, మన్మోహన్ సింగ్ పేరు ఖరారు చేయడంలోనూ ఆయన విశేష కృషి చేశారు. తమ జిల్లాకు విశ్వవిద్యాలయం దక్కడం ద్వారా తాను కలగన్న స్వప్నం సాకారమైందని తుమ్మల పేర్కొన్నారు. "రేవంత్ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం తెలంగాణ విద్యా రంగానికి కొత్త దిశను చూపుతుంది" అని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులకు మంచి విద్యావకాశాలు లభించే అవకాశాలు ఏర్పాడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**300 ఎకరాల్లో అద్భుత ప్రాజెక్ట్ – దేశానికే తలమానికం...**

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ ఉన్న స్థావరంలోనే 300 ఎకరాల విస్తీర్ణంలో "మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ" రూపుదిద్దుకుంటోంది. అత్యాధునిక ల్యాబ్‌లు, అంతర్జాతీయ ప్రమాణాల పరిశోధనా సౌకర్యాలతో ఈ విశ్వవిద్యాలయం దేశంలోనే ఒక ప్రత్యేక మోడల్‌గా నిలవనుంది. ఇక్కడి నుండి వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యా, శాస్త్ర పరిశోధనల్లో ముందంజ వేయనున్నారు. భూవిజ్ఞానం, ఖనిజ వనరుల వినియోగం, పర్యావరణ సంరక్షణ వంటి రంగాల్లో పరిశోధనలు కొనసాగనున్నాయి.

**భవిష్యత్తు తరాల కోసం శాస్త్రీయ కేంద్రం...**

ఈ విశ్వవిద్యాలయంలో జియోకెమిస్ట్రీ, జియోఫిజిక్స్, ప్లానెటరీ జియాలజీ, స్ట్రక్చరల్ జియాలజీ, పర్యావరణ భూగర్భశాస్త్రం వంటి కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. భూగర్భ వనరుల పరిశోధనకు, దేశ సుస్థిర అభివృద్ధికి ఇది ప్రధాన కేంద్రమవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం.. ఖనిజ సంపదకు నూతన గుర్తింపు...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహజ వనరులు, బొగ్గు మరియు ఖనిజాలతో సమృద్ధిగా ఉంది. ఇది దక్షిణ భారతదేశానికి "ఖనిజ నిధి"గా పరిగణించబడుతోంది. ఈ ప్రాంతంలో నేషనల్ హైవేకు సమీపంగా 300 ఎకరాల విస్తీర్ణంలో ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటవుతోంది. సమీపంలో ఐటీసీ పేపర్ బోర్డు, హెవీ వాటర్ ప్లాంట్, నావా లిమిటెడ్, ఫెరో ఎల్లాయ్ పరిశ్రమలు, విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. అదేవిధంగా, 20 కిలోమీటర్ల దూరంలో ప్రతిపాదిత విమానాశ్రయం కూడా రానుంది. గోదావరి నది సమీపంలో ఉండడం వలన నీటి సమస్యలు ఉండవు.

**ఉపాధి అవకాశాల పునరుజ్జీవనం....**

విశ్వవిద్యాలయం ఏర్పాటుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిరుద్యోగ యువతకు కొత్త అవకాశాలు లభించనున్నాయి. వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తి చేసి పరిశోధన, పరిశ్రమల రంగాల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. అంతేకాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా అక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుంది.

**జాతీయస్థాయి గుర్తింపు – గర్వకారణం తెలంగాణకు....**

మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుతో తెలంగాణ విద్యా రంగం జాతీయస్థాయిలో కొత్త గుర్తింపు పొందనుంది. మాజీ ప్రధాని గౌరవార్థం ఈ పేరు పెట్టడం రాష్ట్రానికి గౌరవకారణం. భద్రాద్రి కొత్తగూడెం పేరు ఇకపై జాతీయ స్థాయిలో మారు మ్రోగనుంది.

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సంబరాలు....**

తెలంగాణ క్యాబినెట్ నిర్ణయంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆనందోత్సాహం వెల్లివిరిసింది. ప్రజలు, విద్యార్థులు, శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు విశ్వవిద్యాలయానికి మన్మోహన్ సింగ్ పేరు రావడం పట్ల గర్వంగా భావిస్తున్నారు. విద్యార్థి సంఘాలు, ప్రజాసంస్థలు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ సంతోష వెలిబుచ్చుతున్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- **-భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగరాదు**
  **-భూపాలపల్లి ఎమ్మెల్యే గంగ సత్యనారాయణరావు**

**భూపాలపల్లి అక్టోబర్ 16 (డీ డీ 9 వార్త )**



రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి బుగులోని జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన బుగులోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం జాతర, బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పోలీస్, సింగరేణి, వైద్య, ఆర్టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. శాసన సభ్యులు మాట్లాడుతూ, రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో నవంబర్ 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరిగే శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి జాతరకు వేలాదిమంది భక్తులు తరలివస్తారని, అందువల్ల అన్ని శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా తాత్కాలిక మరమ్మతులు, రహదారి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. భక్తులు గుట్టపైకి ఎక్కడానికి అనువుగా ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పరకాల, భూపాలపల్లి ఇతర డిపోల నుండి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అత్యవసర వైద్య కేంద్రాలు, 108 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. భక్తులకు సురక్షిత త్రాగునీరు అందించేందుకు ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతర సమయంలో భక్తుల రద్దీ నియంత్రణకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచాలని, అలాగే అటవీ శాఖ తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జాతర నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారిగా చేపట్టాల్సిన పనులపై అంచనా నివేదికలు ఇవ్వాలని సూచించారు. సిసి కెమెరాల ద్వారా బందోబస్తు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే, అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సింగరేణి జీఎం రాజేశ్వర రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఆర్టీసీ డిఎం ఇందు, డివిజనల్ పంచాయతి అధికారి మల్లికార్జున్ రెడ్డి, దేవస్థానం చైర్మన్ రమణా రెడ్డి, దేవస్థానం ఈఓ బిల్ల శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సి.ఎస్.పి లో కార్మికుల వేదింపులు తీవ్ర స్థాయికి!!

- అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి డిమాండ్
- ఇన్‌ఫార్మర్ గిరి చేస్తే కార్మికులే తరిమికొట్టే పరిస్థితి – ఏఐటియుసి నాయకుల హెచ్చరిక



**పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

సి.ఎస్.పి 1 లో విధుల్లో ఉన్న కార్మికులను మానసికంగా వేధిస్తున్న అధికారులపై యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె వన్ సి.ఎస్.పి వద్ద జరిగిన గేట్ మీటింగ్‌లో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచ్ కార్యదర్శి ఆరెల్లి పోషం పాల్గొని మాట్లాడుతూ, అధికారులు కొంతమంది కార్మికులు, సూపర్‌వైజర్లను "ఇన్‌ఫార్మర్‌లు, గూఢచారులు"గా వాడుకుంటూ విధుల్లో ఉన్న కార్మికులపై ఫోటోలు, వీడియోలు తీసి వారిని వేదించడం దారుణమన్నారు.

ఇది ప్రభుత్వ రంగ సంస్థ అని గుర్తు చేస్తూ, ప్రైవేటు సంస్థల మాదిరిగా వ్యవహరించడం ఏ విధంగానూ సహించేది కాదని హెచ్చరించారు. "వన్ సి.ఎస్.పి అధికారులు నియంతలుగా ప్రవర్తిస్తూ, తాము అనుకూలంగా ఉన్న కార్మికులకు ఎలాంటి విధులు అప్పగించకుండా మస్టర్లు ఇస్తూ వారిని ఇతరులపై గూఢచారులుగా వాడుకోవడం తగదని" అన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న అధికారులపై యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని, లేనిచో కార్మికులే వారిని తరిమికొట్టే పరిస్థితి వస్తుందని నాయకులు హెచ్చరించారు. సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడేది ఏఐటియుసి మాత్రమేనని, సంస్థ రక్షణ కోసం తాము ఎప్పటికప్పుడు అండగా ఉంటామని వారు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచ్ డిపార్ట్‌మెంట్ ఇంచార్జి సయ్యద్ సోహేల్, నాయకులు ఎస్. వెంకట్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్ కార్యదర్శి బండి మల్లేష్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ. గౌస్, నాయకులు బి. సమ్మయ్య, జానీమియా, రాజేశ్వరరావు, సుభాష్, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.



# మాత శిశు సంరక్షణ వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం...

**అక్టోబర్ 16 డిడి 9 వార్త వెంకటాపురం (నూగురు).**

వెంకటాపురం మండల కేంద్రంలో గల నూగురు, మహితాపురం ,గంగారం గ్రామాలలో మాత శిశు సంరక్షణ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగింది. గ్రామంలో గల గర్భిణీ స్త్రీలు, బాలింతలకు మధుమేహం, రక్తపోటు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేయడం జరిగింది. జ్వర పీడితులకు రక్తన మూలాలు సేకరించి ఆర్టీడీ నిర్ధారణ పరీక్షలు చేయడం జరిగింది. బాలింత తల్లులకు వ్యాధినిరోధక టీకాలు తప్పక వేయించాలని వైద్యాధికారి తెలిపారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వేడి వేడి ఆహారం,కాచి చల్లార్చిన నీరుని మాత్రమే తాగాలని గ్రామస్తులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాతా శిశు సంరక్షణ అధికారి భాస్కరరావు తో పాటు H.E.O కోటిరెడ్డి, స్టాఫ్ నర్స్ స్వప్న, హెల్త్ అసిస్టెంట్ రాఘవులు, అంగన్వాడి టీచర్ ,ఆశా కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కమీషనరేట్ లో ఫ్లాగ్ డే వారోత్సవాలు

- అక్టోబర్ 21 నుండి 31 వరకు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు
- షార్ట్ ఫిలిం, ఫోటోగ్రఫీ పోటీలు
- సీపీ అంబర్ కిషోర్ ఝా



**పెద్దపల్లి/రామగుండం, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

రామగుండం కమిషనరేట్ పరిధిలో అక్టోబర్ 21 నుండి 31 వరకు పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ స్టేషన్ పరిధుల్లో పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు**

ప్రజల్లో పోలీస్ సేవలపై అవగాహన కల్పించేందుకు ఓపెన్‌హౌస్ కార్యక్రమాలు చేపట్టనున్నారు. పోలీస్ విధులు, సాంకేతిక వినియోగం, త్యాగాలు, సేవలను వివరించనున్నారు. పోలీసు సిబ్బందికి రెండు వర్గాలుగా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు.

కేటగిరీ-1: కానిస్టేబుల్ నుంచి ఎఎస్ఐ వరకు — జెండర్ డిస్క్రిమినేషన్ ఎట్ వర్క్ ప్లేస్

కేటగిరీ-2: ఎస్ఐ స్థాయి నుండి పై స్థాయి వరకు — స్ట్రెంథెనింగ్ ఆఫ్ గ్రౌండ్ లెవెల్ పోలీసింగ్ వ్యాసాలు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో 500 పదాలకు మించకూడదని తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

**రక్తదానం, సైకిల్ ర్యాలీలు**

పోలీస్ అమరవీరుల స్మారకార్థం రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలను నిర్వహిస్తారు. అమరవీరుల కుటుంబాలను సందర్శించి నివాళులు అర్పించనున్నట్లు సీపీ తెలిపారు.

**షార్ట్ ఫిలిం, ఫోటో పోటీలు**

పోలీసు త్యాగాలు, సేవలపై ఆసక్తిగల యువత పాల్గొనాలని సీపీ పిలుపునిచ్చారు.

షార్ట్ ఫిలిం: గరిష్టంగా 3 నిమిషాల నిడివి.

ఫోటోలు: 10 x 8 సైజులో మూడు ఫోటోలు.

ఫోటోలు, వీడియోలను అక్టోబర్ 23లోపు స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌ఐబి) కార్యాలయానికి అందజేయాలని సూచించారు. ఎంపికైన ఫిలింలు, ఫోటోలు రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ అక్టోబర్ 21 నుంచి 31 వరకు పోలీస్ కళాబృందం పాటల కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రధాన కూడళ్ల వద్ద అమరవీరుల బ్యానర్లను ఏర్పాటు చేస్తారు. అక్టోబర్ 21న రామగుండం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో "స్మృతి పరేడ్", "పోలీస్ ఫ్లాగ్ డే" కార్యక్రమాలు నిర్వహించి అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తామని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు లాభాల వాటా, దీపావళి బోనస్ వెంటనే చెల్లించాలి!

- విశ్రాంత ఉద్యోగుల వేదన వ్యక్తం చేసిన రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

**పెద్దపల్లి, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు సంస్థ లాభాల వాటా మరియు దీపావళి బోనస్‌ను తక్షణమే చెల్లించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నాడు పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడా ఓయూ కాలనీలో సమావేశమైన రిటైర్డ్ ఉద్యోగులు మాట్లాడుతూ, గత నెల 29న ప్రస్తుత ఉద్యోగులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 34 శాతం లాభాల వాటా చెల్లించడంతో వారు ఉత్సాహంగా దసరా పండుగ జరుపుకున్నారని గుర్తు చేశారు.

ప్రతి సంవత్సరం దీపావళికి చెల్లించే పి.ఎల్.ఆర్ (దీపావళి) బోనస్ రూ.1,03,000ను ఈ నెల 17న చెల్లిస్తామని యాజమాన్యం ప్రకటించినప్పటికీ, రిటైర్డ్ ఉద్యోగులకు మాత్రం చెల్లింపులు ఆలస్యం అవడం విచారకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

30-40 సంవత్సరాలు సింగరేణి అభివృద్ధికి కృషి చేసిన మాకు ఇప్పుడు లభించాల్సిన లాభాల వాటా, బోనస్ కోసం వేచి చూడాల్సి రావడం బాధాకరం అని వారు పేర్కొన్నారు. సాంకేతికంగా అగ్రగామిగా ఉన్న సంస్థ క్షణాల్లో గణాంకాలను సమర్పించగలదని, అయినప్పటికీ రిటైర్డ్ ఉద్యోగుల చెల్లింపుల్లో జాప్యం ఎందుకని ప్రశ్నించారు.

ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగులకు కూడా ఒకే తేదీన దీపావళి బోనస్, లాభాల వాటా చెల్లించి, రిటైర్డ్ కుటుంబాల్లో దీపకాంతులు వెదజల్లాలని యాజమాన్యాన్ని కోరుతున్నట్లు అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ తెలిపారు.

ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులు కంచ బీరయ్య, గీస కనకయ్య, పొగాకు రవీందర్, ఎం.డి. రఫీక్ అహ్మద్, కె.జి. రాజు తదితరులు పాల్గొన్నారు.






# ప్రజా సేవలలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- మున్సిపల్ కమిషనర్ జె. అరుణ శ్రీ

**పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్16 (డీడీ9 వార్త):**

రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలకు మున్సిపల్ సేవలు సమర్థవంతంగా అందించేందుకు వార్డు అధికారులు మరింత అంకిత భావంతో పని చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం మున్సిపల్ కమిషనర్ జె. అరుణ శ్రీ సూచించారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆస్తి పన్ను మరియు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు లక్ష్యాల ప్రకారం వసూలు చేయాలని సూచించారు. భారీ బకాయిలు ఉన్న వారికి రెవెన్యూ రికవరీ చట్టం క్రింద నోటీసులు జారీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజన్‌లలో పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా జరిగేలా చూడాలని, మున్సిపల్ సేవలకు సంబంధించి ప్రజలు దృష్టికి తెచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చూడాలని ఆమె సూచించారు. అదనంగా, నిషేధిత ప్లాస్టిక్ వినియోగం గుర్తించిన సందర్భంలో సంబంధిత మెటీరియల్ స్వాధీనం చేసుకొని జరిమానాలు విధించాలని కమిషనర్ ఆదేశించారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే వారిపై అపరాధ రుసుము వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ మారుతి ప్రసాద్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్.ఓ ఆంజనేయులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, ఆర్.ఐలు శంకర్ రావు, ఖాజా, వార్డు అధికారులు, వార్డు అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



## ఆకెనపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ పనులకు శుభారంభం

- **ప్రజా సేవలో ముందుండే నాయకుడు – గాదె సుధాకర్**

**పెద్దపల్లి/అంతర్గం, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

రామగుండం నియోజకవర్గంలోని అంతర్గం మండలం ఆకెనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ గాదె సుధాకర్ శుభారంభం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సంకల్పం మేరకు, రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల ప్రకారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బరిగల స్రవంతి-సతీష్, శ్రీరాముల విజయ-సత్తయ్యల ఇళ్ల స్లాబ్ పనులు ప్రారంభించబడ్డాయి. సుధాకర్ ప్రజల అభివృద్ధి, గృహనిర్మాణం, పేదల సంక్షేమం పట్ల ఎల్లప్పుడూ శ్రద్ధ చూపుతూ, ప్రజలతో కలిసి పనిచేసే నాయకుడిగా నిలిచారు. ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ ప్రియశిష్యుడైన గాదె సుధాకర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంకల్పాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి, సామాజిక సేవ, ప్రజా సంక్షేమం పట్ల ఆయన చూపుతున్న అంకితభావం ఆకెనపల్లి ప్రజల్లో విశేష ఆదరణ పొందుతోంది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మర్రి రాజకుమార్, మాజీ సర్పంచ్ గంగాధర్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంతిని మహేందర్, మహిళా నాయకురాళ్లు ఐలవేణి అనసూర్య, పిట్టల మంజుల, ఐలవేణి లక్ష్మి, ఐలవేణి రమ, బరిగల గట్టయ్య, మేస్త్రి సున్నం కనుకయ్య మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు పదోన్నతులు కల్పించాలి

- **సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ బీఎంఎస్ డిమాండ్**

**పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పదోన్నతులు కల్పించాలని సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ బీఎంఎస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ రోజు సాయంత్రం రామగుండం ఆర్జి 1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ కు యూనియన్ తరపున మెమోరాండం అందజేశారు. అనంతరం సంఘ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య మాట్లాడుతూ, అన్‌స్కిల్డ్‌గా పనిచేస్తున్న కార్మికులకు సెమిస్కిల్డ్ వేతనాలు, సెమిస్కిల్డ్‌గా పనిచేస్తున్న వారికి స్కిల్డ్ వేతనాలు, స్కిల్డ్ కార్మికులకు హైలీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు సింగరేణి సంస్థ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని, కానీ వేతనాలు, పదోన్నతుల విషయంలో న్యాయం జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు బీఎంఎస్ యూనియన్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గుండెబోయిన భూమయ్య, చిగురు లక్ష్మణ్, గొడుగు సమ్మయ్య, గూడెపు వినోద్, సుంకరి సురేష్, సాయి భరత్, భూసారపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల సక్సెస్‌కు కేరాఫ్ నారాయణ విద్యాసంస్థలు

- **మాస్టర్ ఓరియెంటర్ కాంటెస్ట్ ఘనంగా నిర్వహణ**

**పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

గోదావరిఖని మార్కండేయ కాలనీలోని నారాయణ పాఠశాలలో నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో మాస్టర్ ఓరియెంటర్ కాంటెస్ట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణ పాఠశాలల ఏజీఎం చైతన్య రావు, చామ్స్ ఆర్ అండ్ డి హెడ్ స్వాతి లక్ష్మి, సాఫ్ట్ స్కిల్స్ లీడ్ గీత కుమారి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కరీంనగర్ జోన్ పరిధిలోని గోదావరిఖని, మంచిర్యాల, కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల, జగిత్యాల నారాయణ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ప్రదర్శనా ప్రతిభను చూపుతూ నృత్యాలు, పాటలు, ఆటలతో వేదికను కట్టిపడేశారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ నైపుణ్యం పెంపొందించడమే ఈ పోటీల ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జోన్ ఏజీఎం చైతన్య రావు, ఆర్.ఐ. సత్యం రావు, ప్రిన్సిపాళ్లు రజని, భాస్కర్ రెడ్డి, స్రవంతి, రమ్య, క్రాంతి పాల్, శాంతి కిరణ్, వైస్ ప్రిన్సిపాళ్లు, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.







## మార్కండేయ శివాలయంలో కార్తీకమాస లక్ష దీపోత్సవానికి సన్నాహకాలు ప్రారంభం

- **ఉత్సవ కమిటీ సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు**

**పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

గోదావరిఖని మార్కండేయ కాలనీలోని మార్కండేయ శివాలయ ఆవరణలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీ మంచికట్ల బిక్షపతి గారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే కార్తీకమాసంలో లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు.



ఉత్సవ కమిటీ నిర్ణయించిన ప్రకారం నవంబర్ 1వ తేదీ (శనివారం) నుండి నవంబర్ 5వ తేదీ (బుధవారం) వరకు ఐదు రోజులపాటు ప్రతిరోజూ సాయంత్రం 6.00 గంటలకు లక్ష దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సంబంధించి పలు తీర్మానాలు ఆమోదించడంతోపాటు బాధ్యతలను సభ్యులకు అప్పగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చక్కగా చేయాలని నిర్వాహకులు సూచించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ దుగ్గిరాల రాఘవాచార్యులు మాట్లాడుతూ, ఈ కార్తీకమాస దీపోత్సవం ద్వారా భక్తులు శివకృపను పొందగలరని తెలిపారు. సభలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు శ్రీ మంచికట్ల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి శ్రీ బండారి రాజమల్లు, కోశాధికారి శ్రీ గడ్డం రవి, ముఖ్య సలహాదారు శ్రీ కొండి లక్ష్మీపతి, ఆలయ అర్చకులు శ్రీ దుగ్గిరాల రాఘవాచార్యులు, కానుగంటి నారాయణ, తాటిపాముల రాజేష్, లెంకల రాజిరెడ్డి, బోయిని కొమరయ్య, నగునూరి రమేష్, సిరిపురం రమేష్, మాటేటి సతీష్, బొద్దుల వేణు, లెంకల వీరారెడ్డి, కోలేటి కిషన్, దారా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు ఈ సందర్భంగా భక్తజనులను లక్ష దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొని శివుడి ఆశీస్సులు పొందాలని ఆహ్వానించారు. అలాగే, ఈ ఉత్సవానికి ధన, వస్తు రూపంలో విరాళాలు అందజేయాలనుకునే దాతలు శ్రీ దుగ్గిరాల రాఘవాచార్యులు గారిని సంప్రదించాలని తెలిపారు.

## బీసీ బంద్‌కి ఎన్.ఫ్.ఐ.డబ్ల్యు మద్దతు

- **బీజేపీ ఎంపీలు రాజీనామాచేయాలని డిమాండ్**
- **బీసీ రిజర్వేషన్ల రద్దు యత్నాలను వ్యతిరేకిస్తూ తీవ్ర విమర్శలు**

**పెద్దపల్లి, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్.ఫ్.ఐ.డబ్ల్యు) రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను రద్దు చేసే కుట్రలు పన్నుతోందని తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా ఎన్.ఫ్.ఐ.డబ్ల్యు పెద్దపల్లి జిల్లా గౌరవాధ్యక్షురాలు మడికొండ ఓదమ్మ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయలక్ష్మి, ఆసాల రమ, ఉపాధ్యక్షురాలు యాసర్ల తిరుమల, నగర నాయకులు రాళ్లు గోసిక రాజేశ్వరి, దుబాసి రేణుక, చింతల సుజాత, కటుకూరి భాగ్యలక్ష్మి, ఎం.డి. నస్రిన్ తదితరులు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అగ్రకుల దురహంకారంతో బీసీ రిజర్వేషన్లను బలహీనపర్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో 42% బీసీ రిజర్వేషన్ సాధన కోసం బీసీ జేఏసీ పిలుపునిచ్చిన ఈనెల 18న బంద్‌కి ఎన్.ఫ్.ఐ.డబ్ల్యు మద్దతు ప్రకటించారు. వారు మాట్లాడుతూ... "అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించిన 42% రిజర్వేషన్ బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించి ఉంటే హైకోర్టు దాన్ని కొట్టివేసేది కాదు. దీనికి పూర్తి బాధ్యత బీజేపీదే. ప్రజలు బీజేపీని గద్దె దించాలని సమయం ఆసన్నమైంది," అన్నారు. అలాగే, రాష్ట్రంలో ఉన్న 8 మంది బీజేపీ ఎంపీలు బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్రాన్ని ఒప్పించకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. వెంటనే బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బంద్ విజయవంతం కావడానికి ఎన్.ఫ్.ఐ.డబ్ల్యు తమ మద్దతుతోపాటు ప్రత్యక్షంగా పాల్గొంటామని తెలిపారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాల బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

NFIW

# పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలో 24 గంటల అధునాతన వైద్య సేవలు

- **50 పడకల నుండి 100 పడకలకు పెంపు**
- **పేదలకు మెరుగైన వైద్యసేవలు**
- **ప్రభుత్వ ఆసుపత్రి ప్రసూతి ప్రక్రియ ఆడబిడ్డలకు పుట్టినిల్లుగా మారింది**
- **ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పర్యటన**

**పెద్దపల్లి, అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల అధునాతన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. ఈ రోజు ఆసుపత్రిని సందర్శించిన అనంతరం వైద్య శాఖ అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ ఆసుపత్రిలో సేవల నాణ్యత గణనీయంగా మెరుగుపడిందని పేర్కొన్నారు. గతంలో 50 పడకలతో ఉన్న ఆసుపత్రిని ఇప్పుడు 100 పడకల దవాఖానగా విస్తరిస్తున్నామని తెలిపారు. ముందుగా ప్రతి రోజు ఒక్కో రంగు బెడ్‌షీట్‌ల వినియోగాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ... ఇది రాష్ట్రంలోనే తొలిసారిగా అమలు చేస్తున్న పద్ధతి అని చెప్పారు. ఈ విధానం వల్ల రోగులకు శుభ్రమైన బెడ్‌షీట్లు అందుతాయని తెలిపారు. ఆయన మాట్లాడుతూ, "గత నెలలో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి సేవల విషయంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. సెప్టెంబర్ నెలలో 250 మంది గర్భిణీ స్త్రీలకు ప్రసూతి సేవలు, 26,730 ఓపి






సేవలు, 123 మందికి టీఫా స్కానింగ్, అలాగే 316 మందికి ఆరోగ్యశ్రీ సేవలు అందించాం" అని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సహకారంతో, ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే వైద్య సేవలు ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సేవల ద్వారా ప్రతి నెల దాదాపు రూ.7.04 కోట్ల వరకు ప్రజలకు ఆర్థిక ఆదా జరుగుతోందని చెప్పారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రారంభిస్తామని తెలిపారు. వెంటిలేటర్లు, ఎమ్ఆర్ఐ, సిటి స్కాన్ వంటి ఆధునాతన పరికరాల కోసం సుమారు రూ.20 కోట్ల విలువైన ఎక్విప్‌మెంట్ ఆర్డర్ చేస్తున్నామని చెప్పారు. "మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు కూడా త్వరలో ఇక్కడే చేస్తాము. ఏ రోగి కూడా అసంతృప్తితో ఇంటికి వెళ్ళకూడదు. వైద్య సిబ్బంది అందరూ జవాబుదారీతనంతో పని చేయాలి" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తర్వాత కొత్తగా నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రి పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారులు, డాక్టర్లు, మార్కెట్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 42%బీసీ రిజర్వేషన్ కోసం అక్టోబర్ 18న భద్రాచలంలో సంపూర్ణ బంద్‌కు బీసీ ఐక్యవేదిక పిలుపు!

- **అఖిలపక్షాల మద్దతుతో బంద్ విజయవంతం చేస్తాం: బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు బొలిశెట్టి రంగారావు**

**భద్రాచలం అక్టోబర్ 16 (డిడి9 వార్త):**

భద్రాచలంలో అక్టోబర్ 16 గురువారం సాయంత్రం 6 గంటలకు కాంట్రాక్టర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం ఘనంగా జరిగింది. 62 శాతం జనాభా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు బొలిశెట్టి రంగారావు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "42 శాతం రిజర్వేషన్ కోసం బీసీలు పోరాటం చేస్తుంటే, అగ్రవర్ణ నాయకులు దానిని తప్పుదారి పట్టించాలని చూస్తున్నారు. ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ, బీసీలను అయోమయానికి గురిచేయాలని ప్రయత్నిస్తున్నారు. కానీ బీసీలు అన్ని విషయాలను తెలివిగా గమనిస్తున్నారు" అని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ అంశం నిలిచిపోయిన నేపథ్యంలో, బీసీ జేఏసీ రాష్ట్రస్థాయి నుంచి వచ్చిన పిలుపు మేరకు, అక్టోబర్ 18, 2025న సంపూర్ణ బంద్‌ను నిర్వహించబోతున్నట్లు రంగారావు ప్రకటించారు. అఖిలపక్షాల సహకారంతో ఈ బంద్‌ను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. బీసీ సోదరులు, అఖిలపక్ష నాయకులు, వ్యాపార వర్గాలు, మేధావులు ఈ బంద్‌కు మద్దతు పలకాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు గడ్డం స్వామి, బండారు శరత్ బాబు, సీపీఐ నాయకులు శ్రీనివాస్, మాస్ లైన్ నాయకురాలు పెచ్చల కల్పనక్క, శివ, బీసీ గౌరవాధ్యక్షులు టీవీ గారు, ప్రధాన కార్యదర్శి బండారు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు అను గోజు నరసింహ చారి, సహాయ కార్యదర్శి మేకల మల్లు బాబు యాదవ్, కోశాధికారి కోపనాతి శాంతారావు, పద్మశాలి నాయకులు అనుమల గంగాధర్, సంఘం నాయకులు ఏ కుల రామచంద్ర రావు, ముదిరాజ్ సంఘం నాయకులు రాగం నిర్మలానందం, అగ్నికుల క్షత్రియ నాయకులు ప్రచార కార్యదర్శి పున్నయ్య, మల్లాడ శ్రీధర్, మల్లాడి చక్రి సుబ్బారావు, శోభన్ బాబు, గణేష్ పాల్గొన్నారు.



# భద్రాచలం ఆర్టీసీ కండక్టర్ గుండెపోటుతో మృతి

- **విధి నిర్వహణలో విషాదం**
- **టికెట్లు ఇస్తుండగా అకస్మాత్తుగా ఛాతీ నొప్పి**

**దుమ్ముగూడెం అక్టోబర్ 16 (డిడి9 వార్త )**

భద్రాచలం ఆర్టీసీ డిపోకు చెందిన సైదులు కండక్టర్ గురువారం ఉదయం విధి నిర్వహణలో గుండెపోటుతో మరణించారు. మృతుడిని మధిర గ్రామానికి చెందిన సైదులుగా గుర్తించారు.

వివరాల్లోకి వెళ్తే...గురువారం ఉదయం భద్రాచలం నుంచి వెంకటాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో కండక్టర్ సైదులు ప్రయాణికులకు టిక్కెట్లు ఇస్తుండగా అకస్మాత్తుగా ఛాతీలో తీవ్ర నొప్పి రావడంతో వెంటనే అప్రమత్తమై తన కండక్టర్ సీటులో కూర్చొని ఆయన డ్రైవర్‌కు విషయం తెలియజేశారు. డ్రైవర్ తక్షణమే బస్సును పక్కకు ఆపి, సమీపంలోని పీహెచ్‌సీకి వైద్యం కోసం తరలించారు. పీహెచ్‌సీలోని వైద్యులు కండక్టర్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈ విషయం తెలుసుకున్న భద్రాచలం ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ (డీఎం) జంగయ్య, సీఐ రామయ్య, పోకల సురేష్‌లు వెంటనే భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. కండక్టర్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూపర్డెంట్‌ను కోరారు.

అయితే, భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకున్న వెంటనే కండక్టర్‌ను పరీక్షించిన వైద్యులు, ఆయన దారి మార్గంలోనే మరణించినట్లుగా నిర్ధారించారు. కండక్టర్ గుండెపోటు కారణంగానే మరణించినట్లు వైద్యులు స్పష్టం చేశారు.

కండక్టర్ మృతితో అతని కుటుంబంలో, స్వగ్రామమైన మధిరలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. డీఎం జంగయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్‌తో మాట్లాడి, కండక్టర్ సైదులు పార్థివ దేహాన్ని పార్థివ వాహనంలో మధిరకు తరలించారు. అంతేకాక, మృతుడు సైదులు దహన సంస్కారాల కోసం డీఎం జంగయ్య మృతుడి భార్యకు తక్షణ సహాయంగా రూ. 30,000 నగదు అందజేశారు.



# రూ. 8 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన నల్లగొండ ఫైర్ ఆఫీసర్

- **- లంచం తీసుకుంటూ పట్టుబడిన అగ్నిమాపక శాఖ అధికారి**

**నల్లగొండ అక్టోబర్ 16 ( డిడి9 వార్త )**

బాణసంచా దుకాణం నిర్వహణకు సంబంధించి తాత్కాలిక లైసెన్స్ జారీ ప్రక్రియలో భాగంగా రూ.8,000/ లంచం స్వీకరిస్తూ నల్లగొండ ఫైర్ స్టేషన్ అధికారి ఏ. సత్యనారాయణ రెడ్డిని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

వివరాల్లోకి వెళితే, ఒక ఫిర్యాదుదారుడు తన బాణసంచా దుకాణానికి తాత్కాలిక లైసెన్స్ పొందేందుకు అగ్నిమాపక శాఖ (ఫైర్ డిపార్ట్‌మెంట్) నుండి నిరభ్యంతర ధృవీకరణ పత్రం (NOC) కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు గాను, స్టేషన్ అధికారి ఏ. సత్యనారాయణ రెడ్డి ఫిర్యాదుదారుడిని రూ.8,000/ లంచం డిమాండ్ చేసినట్లుగా ఏసీబీకి ఫిర్యాదు అందింది. దీంతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ఉచ్చు పన్ని, ఫిర్యాదుదారుడి నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో అధికారి సత్యనారాయణ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అవినీతికి పాల్పడే ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఏసీబీ స్పష్టం చేసింది.

**-- ఏసీబీ విజ్ఞప్తి**



ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే, ప్రజలు వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయవచ్చని, లేదా వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (Telangana ACB), ఎక్స్ (@TelanganaACB) ద్వారా లేదా వెబ్‌సైట్ (acb.telangana.gov.in) ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఏసీబీ అధికారులు హామీ ఇచ్చారు

# 18న జరుగు బంద్ కు బీఆర్ఎస్ పార్టీ మద్దతు

**మణుగూరు, అక్టోబర్ 15, డిడి 9 వార్త**



కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను 42 శాతం రిజర్వేషన్ పేరుతో మోసగించిదని ఎలాగైతే కాలేశ్వరం ప్రాజెక్టు పేరుతో, ఈ ఫార్ములా కార్ రేస్ పేరుతో , అలాగే ఫోన్ ట్యాపింగ్ పేరుతో ఈ ప్రభుత్వం కాలయాపన చేసిందో.. అలాగే బీసీలకు ఇచ్చిన 42% రిజర్వేషన్ న్యాయస్థానాల పేరుతో కాలయాపన చేస్తున్నందున దీనికి నిరసనగా ఈనెల 18న బీసీ సంఘాలు పిలుపునిచ్చినటువంటి తెలంగాణ బంద్ కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు తెలిపారు. కావున ఈ బంద్ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనవలసిందిగా పిలుపునిస్తున్నాను.




# మత్తుకు అలవాటుపడి బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దు: ఎస్ఐ మేడ ప్రసాద్

**బూర్గంపహాడ్ అక్టోబర్ 16 డిడి9 వార్త**

విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని, మత్తుకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని బూర్గంపహాడ్ స్థానిక ఎస్ఐ మేడ ప్రసాద్ హితవు పలికారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చిన్నా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ మేడ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని యువతను ఉద్దేశించి మాట్లాడారు.

యువత మంచి నడవడికతో మెలగాలని, హానికర పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మంచి చదువుతో పాటు మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై జిల్లా పోలీసు శాఖ తరఫున నిత్యం అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ చిన్నా మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాలు లాంటి చెడు వ్యసనాలకు బానిసలై తమ అమూల్య జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని, ఆ లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని సూచించారు. మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్ వంటివి తీసుకుంటే ఆరోగ్యంపై హానికర ప్రభావాలు పడటంతో పాటు ఆర్థిక నష్టాలు, సమాజంలో గుర్తింపు, గౌరవం కోల్పోతారని హెచ్చరించారు. డ్రగ్స్ నిర్మూలన పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్తు అందించాలని పిలుపునిచ్చారు. అదనపు ఎస్ఐ ఈ. నాగభిక్షం మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ దశ చాలా కీలకమైనదని, ఈ సమయంలో విద్యార్థులు తీసుకునే నిర్ణయాలపైనే వారి జీవితం ముడిపడి ఉంటుందన్నారు. విద్యార్థులు మంచి నడవడికతో చదువుతూ మంచి పేరు ప్రఖ్యాతలు అందుకోవాలని, మత్తు పదార్థాలకు, గంజాయికి దూరంగా ఉంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిన్నా, స్థానిక ఎస్ఐలు మేడ ప్రసాద్, నాగభిక్షం, సీనియర్ అధ్యాపకులు సిహెచ్ నాగేశ్వరావు, ఎన్ఎస్ఎస్ పివో జి. శ్రీనివాస్, అధ్యాపక బృందం, కానిస్టేబుల్ లు పిచ్చయ్య, రాము, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఇసుక అక్రమ రవాణా ముఠా అరెస్టు

- **ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**
- **పరారీలో నకిలీ వెబిల్స్ తయారీదారుడు, లారీ ఓనర్, ఇసుక ర్యాంపు సూపర్వైజర్**

**అశ్వాపురం, అక్టోబర్ 15, డిడి9 వార్త**

ఇసుక అక్రమ రవాణా చేసిన వ్యక్తులను అదుపులో తీసుకొని రిమాండ్ చేసినట్లు మణుగూరు సబ్ డివిజన్ డిఎస్పి రవీందర్ రెడ్డి తెలిపారు. గురువారం అశ్వాపురం పోలీస్ స్టేషన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత ఎనిమిదవ తేదీన జగ్గారం క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా టీఎస్ 30 టిఏ 6498 అనే నంబర్ గల లారీ ఇసుక లోడుతో రాగా దానిని తనిఖీ చేయగా దాని డ్రైవర్ నాతి రాములు వే బిల్లును చూపిస్తాడని, దాని పై అనుమానం వచ్చి గట్టిగా అడగగా అది నకిలీ వే బిల్ అని దాన్ని తమ ఓనరు హైదరాబాద్ నకు చెందిన కర్నాటి శివశంకర్ ఇచ్చి పంపినాడని, డ్రైవర్ చెబుతాడన్నారు. అలాగే రామానుజవరం ర్యాంపులో ఒక వ్యక్తి తనకు డిడి లేకుండా ఇసుక లోడ్ చేసినాడని, దీనిపై లారీని సీజ్ చేసి cr. no. 189/2025 U/Sec 318(4),336(2), 340(2),r/w 3 (5) of బి.ఎన్.ఎస్, కేసు నమోదు చేసామన్నారు. రామానుజవరం ఇసుక ర్యాంపు నందు తనిఖీ చేయగా అక్కడ పనిచేసే టీజీఎండిసి కి సంబంధించిన ముగ్గురు ఉద్యోగులు దగ్గు నిఖిల్ దీప్, నాగేల్లి మధు, బుల్లెద్దు అనిల్ అనువారు డిడి లేకుండా ఇసుకను లారీలో లోడ్ చేసినారని అలాగే ఇసుకను లోడ్ చేసే జెసిబి డ్రైవర్ ఇరగదిండ్ల ఉపేందర్ దానిని లోడ్ చేసినాడని అతనికి లోడ్ చేయమని ర్యాంపులో సూపర్వైజర్ గా పని చేసే సతీష్ రెడ్డి ఫోన్ చేసి లోడ్ చేయమని చెబుతాడని తెలిపారు. అలాగే కర్నాటి శివ శంకర్ గురించి తెలుసుకొని హైదరాబాద్ హయత్ నగర్ లోని అతని ఇంటి వద్దకు వెళ్లగా నేరం ఒప్పుకొని వే బిల్లులు తానే తయారు చేసే వాడిని దానికి ఉపయోగించే లాప్టాప్, ప్రింటర్ అలాగే రామానుజవరం సంబంధించిన స్టాంపును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. శివశంకర్ తనకు వే బిల్లు తయారు చేయడంలో తన ఊరు సంస్థాన్ నారాయణపురం మండలం యాదాద్రి భువనగిరి జిల్లా పుట్టపాకకు చెందిన కిరణ్ అనే అతను వే బిల్లులు తయారు చేయడం నేర్పించినాడని తెలిపారు. అంతకు ముందు కిరణ్ పై 2023వ సంవత్సరంలో నకిలీ వే బిల్లుల తయారు చేసినందుకు వరంగల్ జిల్లా మట్వాడ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయి జైలుకు కూడా వెళ్లినాడని తెలిపారు. తాను కిరణ్ కలిసి పలు రీచ్లకు సంబంధించిన నకిలీ వే బిల్లులు తయారు చేసి పలు మార్లు ఇసుక అక్రమ రవాణా చేసినామని చెప్పినట్టు ఆయన తెలియజేశారు.

**అరెస్టు కాబడిన వ్యక్తుల వివరాలు..**

ఏ1 కర్నాటి శివ శంకర్, ఏ4). నాతి రాములు, ఏ5) ఇరగదిల్ల ఉపేందర్, ఏ6) దగ్గు నిఖిల్ దీప్, ఏ7) నాగేల్లి మధు, ఏ8) బోల్లేదు అనిల్ 41 ఇయర్స్ టీజీఎండిసి సెక్యూరిటీ గార్డ్

**పరారీలో ఉన్నవారు..**


ఏ2 ఈ.కిరణ్ (వే బిల్లు తయారు చేసిన వ్యక్తి)

ఏ3 సతీష్ రెడ్డి ( రామానుజవరం ఇసుక ర్యాంపు), ఏ9 సుర్వే శ్రీకాంత్ (లారీ ఓనర్) గా గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా నకిలీ వే బిల్లులతో ఇసుక అక్రమ రవాణా చేసినా, చేయాలని ప్రయత్నించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కేసులో ఇంకా కొంతమంది అరెస్టు కావలసి ఉన్నందున ఈ కేసులో ఎవరికైనా ప్రమేయం ఉంటే వారిని అరెస్టు చేయడం జరుగుతుంది. ఈ కేసుకు సంబంధించిన వివరములు గాని నకిలీ వే బిల్లుల గురించిన వివరములు గాని ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే అశ్వాపురం సీఐ 8712682093, లేదా ఎస్డిపిఓ మణుగూరు సెల్ నెంబర్. 8712682006 సంప్రదించాలని కోరారు.

# విద్యాశాఖ అధికారి ఆకస్మిత తనిఖీ

**వాజేడు అక్టోబర్ 16 (డీడీ9 వార్త):**

మండల పరిధి లో ఉన్నటువంటి పాఠశాలలను గురువారం మండల విద్యాశాఖ అధికారి తేజావత్ వెంకటేశ్వరావు ఆకస్మిత తనిఖీ నిర్వహించారు ఉదయం 9 గంటలకు ఎంపిపియస్ వాజేడు పాఠశాలకు ప్రార్థన సమయంలో హాజరయ్యి తర్వాత ఎంపీపీయస్ మురుమూరు కాలనీ, ఎంపీపీయస్ మురుమూరు, పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులు బోధిస్తున్న బోధనను పర్యవేక్షించారు ఎఫ్ఎల్ఎన్ లో భాగంగా ప్రతి ఉపాధ్యాయుడు కూడా టిఎల్ఎంలు ఉపయోగించాలని సూచించారు విద్యార్థులు యొక్క అభ్యసన సామర్థ్యం పెంపొందించాలని ప్రతి ఉపాధ్యాయుడు కూడా వర్క్ పుస్తకాలను అనుసరించి పిల్లల్లో నైపుణ్యాలను పెంపొందించాలని అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కూడా టీచింగ్ డైరీ రాయాలని విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు తర్వాత ఎంపీపీయస్ బిజినేపల్లి, ఎంపిపియస్ ప్రగల్లపల్లిని సందర్శించి విద్యార్థుల యొక్క నైపుణ్యాలను బోధన ద్వారా పెంపొందించాలని ఈ సందర్బంగా తెలియజేసేరు వాజేడు మండలంలో ఉపాధ్యాయుల యొక్క ఎఫ్ఆర్ఎస్ వంద శాతం నమోదైందని తెలిపారు పిల్లలు యొక్క ఎఫ్ ఆర్ ఎస్ నందు 73.59 శాతం హాజరు ఉందన్నారు





# అమీర్‌పేట ముంపునకు "హైడ్రా" పరిష్కారం

- **నగర వ్యాప్తంగా ఇదే విధానం**
- **నాలాల డీసిల్టింగ్ పనులు పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్**

**హైదరాబాద్, అక్టోబర్ 16(డిడి 9 వార్త):**



వర్షం వస్తే ఆందోళన పది సెంటీమీటర్ల వర్షం పడితే రహదారులన్నీ జలమయం. ఇక అమీర్‌పేట గురించి ప్రత్యేకంగా చెప్పాలా.. జూబ్లీహిల్స్, గాయత్రీ హిల్స్, యూసుఫ్‌గూడ, కృష్ణానగర్, మదురానగర్, శ్రీనివాస నగర్ ప్రాంతాల నుంచి వచ్చే వరద ముందుకు సాగక అమీర్‌పేటలో నడుం లోతు నీళ్లు ప్రధాన రహదారిపై నిలిచిపోవడం.. వాహన రాకపోకలకు ఇబ్బంది కలగడం.. ఇవన్నీ నగరవాసులకు ప్రతి ఏటా అనుభవంలోకి వచ్చిన వరద కష్టాలే. ఈ ఏడాది ఆ సమస్యకు హైడ్రా పరిష్కారం చూపింది. వరద కష్టాలకు తెర దించింది. ఇప్పుడు 10 సెంటీమీటర్ల వర్షం పడితే నీరు నిలవకుండా ముందుకు సాగేలా హైడ్రా చర్యలు తీసుకుంది. ఈ పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నిరంతరం పర్యవేక్షించారు. హైడ్రా, జీహెచ్ ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ అధికారులతో పలుమార్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కార మార్గం చూపారు. ఈ క్రమంలోనే గురువారం కూడా అమీర్‌పేటలో పర్యటించి పూడుకుపోయిన నాలాలనుంచి మట్టిని, చెత్తను తొలగించే పనులను పర్యవేక్షించారు.

**అమీర్‌పేట ఓ నమూనా..**

అమీర్‌పేటలో వరద ముప్పు తప్పించేందుకు అనుసరించిన విధానం నగరంలోని అనేక ముంపు ప్రాంతాలకు పరిష్కార మార్గమని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు తెలిపారు. పూడుకుపోయిన నాలాలను ఇదే మాదిరి తెరిస్తే చాలావరకు వరద సమస్యకు పరిష్కారం చూపగలమని చెప్పారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అమీర్‌పేట్‌లోని మైత్రివనం జంక్షన్, గాయత్రీ నగర్ ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మొత్తం 6 పైపులైన్లుండగా.. 3 లైన్లను పూర్తి స్థాయిలో పునరుద్ధణ పనులు పూర్తి చేసినట్టు అధికారులు కమిషనర్‌కు తెలిపారు. మరో 3 లైన్లలో పూడిక తీయడంతో పాటు.. ఈ వరదంతా గాయత్రీనగర్‌పై పడకుండా అక్కడ కూడా పైపులైన్లలో మట్టిని తొలగించే పనిని పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. వచ్చే వర్షాకాలానికి నీరు నిలవకుండా గాయత్రీ నగర్ కు ముంపు సమస్య లేకుండా చూడాలన్నారు.

**45 ట్రక్కుల మట్టి తరలింపు..**

అమీర్‌పేట జంక్షన్‌లో సారథీ స్టూడియోస్, మధురానగర్ వైపు నుంచి వచ్చే పైపులైన్లు కలుస్తాయి. ఎగువ నుంచి వరదతో పాటు భారీ మొత్తంలో చెత్త కూడా ఇక్కడకు చేరుతోంది. అలా దశాబ్దాలుగా చేరిన చెత్తతో అమీర్‌పేట జంక్షన్‌లో 6 పైపులైన్లు పూడుకుపోయి.. కొంతమొత్తంలోనే వరద నీరు ముందుకు సాగేది. ఏమాత్రం వర్షం పడినా వరద ముంచెత్తేది. శ్రీనివాస్‌నగర్ వెస్ట్ సైడ్ వరద కాలువ పైన కాంక్రీట్‌తో వేసిన పైకప్పు తెరచి పూడిక తీత పనులను హైడ్రా చేపట్టింది. పరుపులు, దిండులు ఇలా చెత్తతో మూసుకుపోయిన పైపులైన్లను తెరచింది. ఇప్పటి వరకూ ఇలా 45 ట్రక్కుల మట్టిని తొలగించింది. దీంతో ఈ ఏడాది 10 సెంటీమీటర్ల వర్షం పడినా ఇబ్బంది కలగలేదు. మరో 3 పైపు లైన్లలో కూడా పూడికను తొలగిస్తే 15 సెంటీమీటర్ల వర్షం పడినా అమీర్‌పేటలో వరద ముంచెత్తదని హైడ్రా, జీహెచ్ ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ అధికారులు కమిషనర్‌కు తెలిపారు. ఇదే మాదిరి నగరంలోని ముంపు సమస్యను ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో కల్వర్టులు, అండర్‌గ్రౌండ్ పైపు లైన్లలో పూడికను తొలగించి ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు సూచించారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు హైడ్రా బృందం చేపట్టిన పనుల పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

# ఇసుక లారీల ధ్వంసంపై అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమం..!

- **రోడ్లు బాగు చేయకుండా ఇసుక లారీలకు అనుమతిస్తే సడక్ బంద్ చేస్తాం: సీపీఐఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**
- **ఇసుక లారీల విధ్వంసంపై ప్రజాప్రతినిధులు మౌనం వీడాలి: తెలుగుదేశం మండల అధ్యక్షులు చిట్టిబాబు**
- **రహదారుల నిర్మాణం కొరకు ఎంతటి ఉద్యమానికైనా సిద్ధం: కెచ్చల కల్పన (సీపీఐఎంఎల్ మాస్ లైన్)**
- **రాజకీయాలకు అతీతంగా ఉద్యమాలు చేయాలి: భద్రాచలం పుర ప్రముఖులు**

**భద్రాచలం అక్టోబర్ 16 డిడి9 వార్త**




ఇసుక లారీల విధ్వంసంతో ధ్వంసమైన జాతీయ రహదారి పునర్నిర్మాణం కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని సీపీఐఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కలిసొచ్చే అన్ని పక్షాలను కలుపుకొని రహదారులను పునరుద్ధరించేంతవరకు నిరంతరాయ ఉద్యమాలు నిర్మించాలని, తాత్కాలికంగా ఆగిన ఇసుక లారీలను రోడ్లు బాగు చేయకుండా మళ్లీ అనుమతిస్తే 'సడక్ బంద్' నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ఆవరణలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య అధ్యక్షతన అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఇప్పటివరకు వివిధ రాజకీయ పక్షాలు పలు రూపాలలో ఉద్యమాలు నిర్వహించినప్పటికీ ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ స్పందించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రహదారుల నిర్మాణానికి సీపీఐఎం శ్రీకారం చుట్టిందని, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పలు రూపాలలో ఉద్యమాలు నిర్వహించాలని కోరారు.

**ప్రజాప్రతినిధులు మౌనం వీడాలి:**

గోదావరి నది నుండి ఇసుకను తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు రోడ్డుల విధ్వంసంపై మౌనం వీడాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తాళ్లూరు చిట్టిబాబు డిమాండ్ చేశారు. భద్రాచలంవెంకటాపురం జాతీయ రహదారి పూర్తిగా ధ్వంసం అయిపోయిందని, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. సీపీఐఎం చేస్తున్న ఈ మంచి ప్రయత్నానికి తెలుగుదేశం పూర్తిగా మద్దతిస్తుందని, అఖిలపక్ష పోరాటంలో భాగస్వామి అవుతుందని చిట్టిబాబు హామీ ఇచ్చారు.

**ఎంతటి పోరాటానికైనా సిద్ధం:**

ధ్వంసమైన రహదారుల నిర్మాణం కొరకు జరిగే పోరాటంలో సీపీఐఎంఎల్ మాస్ లైన్ పూర్తిగా భాగస్వామ్యం అవుతుందని, ఇసుక లారీల నియంత్రణకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని ఆ పార్టీ డివిజన్ నాయకురాలు కెచ్చల కల్పన స్పష్టం చేశారు. అధిక లోడులతో తిరిగే లారీల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, భద్రాచలం కేంద్రంగా జరిగే ఇసుక దందాను ప్రభుత్వ పెద్దలు ప్రోత్సహిస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం దిగివచ్చేంతవరకు ఉద్యమాలు ఐక్యంగా చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

**నరకయాతన అనుభవించాల్సి వస్తుంది:**

భద్రాచలం నుండి వెంకటాపురానికి ప్రయాణించాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తుందని కొండరెడ్ల సంఘం డివిజన్ నాయకులు రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి ఇసుక ర్యాంపులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతోనే జాతీయ రహదారి ధ్వంసమైందని, అత్యవసర వైద్యం కోసం భద్రాచలం రావాలంటే దారిలోనే ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇసుక ర్యాంపులను నిలిపివేసేంతవరకు పోరాటాన్ని కొనసాగించాలని, అఖిలపక్ష పోరాటానికి మద్దతిస్తామని హామీ ఇచ్చారు.

**ఇసుక దోపిడీ జరుగుతుంది:**

గతంలో ఎన్నడూ లేని విధంగా భద్రాచలం డివిజన్‌లో ఇసుక దోపిడీ జరుగుతుందని ప్రముఖ సంఘ సేవకులు గాదే మాధవరెడ్డి ఆరోపించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా రహదారుల పునర్నిర్మాణం కోసం జరిగే ఈ ఉద్యమానికి ప్రతి ఒక్కరు మద్దతుగా నిలవాలని, భద్రాచలం నియోజకవర్గ పరిరక్షణకు రాజకీయాలను పక్కనపెట్టి కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రముఖ న్యాయవాది పామరాజు తిరుమలరావు, వ్యాపారవేత్త మల్లికార్జునరావు, ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు మున్నాఫ్, రిటైర్డ్ పెన్షనర్స్ నాయకులు బందు వెంకటేశ్వర్లు, నాగభూషణం, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు పరిమి సోమశేఖర్, బీసీ ఐక్యవేదిక నాయకులు నరసింహ చారి, భద్రాచలం సొసైటీ అధ్యక్షులు అభినేని శ్రీనివాస్, మహాజన సమితి నాయకులు జి సుధాకర్ తదితరులు మాట్లాడుతూ, రహదారుల పునర్నిర్మాణం కోసం జరిగే ప్రతి పోరాటంలో కలిసొస్తామని హామీ ఇచ్చారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు భద్రాచలం పట్టణంలోకి లారీలు తిరగకుండా నియంత్రించాలని అధికారులను కోరాలని సూచించారు. అనంతరం ధ్వంశమైన ప్రధాన రహదారి పునర్నిర్మాణం కోసం జరిగే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా భాగస్వాములు కావాలని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది.



# పెళ్లికి నిరాకరించిన ప్రియుడు

- **కుమార్తెకు అన్యాయం జరిగిందని తల్లి ఆత్మహత్యాయత్నం**
- **గడ్డి మందు తాగి తీవ్ర అస్వస్థత, ఆసుపత్రికి తరలింపు**

**దుమ్ముగూడెం, అక్టోబర్ 16 (డిడి 9 వార్త)**

తనను ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో, తన కుమార్తెకు అన్యాయం జరుగుతుందన్న తీవ్ర ఆవేదనతో ఓ తల్లి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషాద సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ప్రస్తుతం ఆమె భద్రాచలం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దుమ్ముగూడెం మండలం లోని రేగుబల్లి గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి, అదే గ్రామానికి చెందిన కొండా వినోద్ అనే యువకుడితో గత నాలుగేళ్లుగా ప్రేమలో ఉంది. ఇటీవల యువతి పెళ్లి చేసుకోవాలని కోరగా, వినోద్ నిరాకరిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో, చేసేది లేక ఆ యువతి తన తల్లితో కలిసి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో యువకుడిపై ఫిర్యాదు చేసింది.

విచారణలో భాగంగా పోలీసులు బుధవారం వినోద్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. యువతిని ప్రేమించిన విషయం, ఆమె మూడు నెలల గర్భానికి ఆ యువకుడే కారణమన్న ఆరోపణలపై పోలీసులు విచారణ జరిపారు. అయితే, వినోద్ తనకు ముందుగానే పెళ్లి అయిందని, యువతిని పెళ్లి చేసుకునే ప్రసక్తే లేదని ఖరాఖండీగా పోలీసులకు చెప్పాడు.

వివాహం అయిన విషయంపై పోలీసులు విచారణ చేస్తుండగా, వినోద్ ఇద్దరు సోదరులు కూడా యువతి గర్భాన్ని తొలగించుకునేందుకు డబ్బు సమకూరుస్తామని బేరసారాలు ఆడినట్లు యువతి బంధువులు ఆరోపిస్తున్నారు. ప్రియుడి నిరాకరణ, కుటుంబ సభ్యుల తీరుతో కలత చెందిన యువతి తల్లి పోలీస్ స్టేషన్ నుంచి ఇంటికి వెళ్లి గడ్డి మందు తాగింది. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది.

వెంటనే గుర్తించిన కుటుంబీకులు, స్థానికులు హుటాహుటిన ఆమెను నరసాపురం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధిత మహిళకు భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. 48 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

